మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటే.. నవ్యాంధ్రలో స్వర్ణయుగం సాకారం అవుతుంది.సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది. రాష్ట్రంలో పలుమార్లు అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 2లక్షల పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీదే.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 03.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34　సంచిక - 134　www.journalistfile.com　పేజీలు 8　వెల : రూ.5.00




# బీళ్లలో ఇక.. గోదావరి పరవళ్లు





## అనకాపల్లికి చేరిన గోదారమ్మకు చంద్రబాబు జలహారతి

## "ఇక ఉత్తరాంధ్రలో బీళ్లన్నీ పంటలే"

## సాగు, తాగునీటితో పాటు పరిశ్రమలకు జలభరోసా

**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రలోకి అడుగుపెట్టాయి. పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ప్రవహించిన గోదారమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి జల హారతి ఇచ్చారు. పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని అనంతరం అక్కడే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనకాపల్లికి గోదారమ్మ తరలి వచ్చిన భావోద్వేగ వాతావరణం మధ్య పోలవరం ఎడమ కాలువలో నిల్చుని గోదావరి జలాలకు పుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించిన సీఎం.. జలహారతి ఇచ్చారు. కాలువకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో చేరిన స్థానికులు, రైతులు, మహిళలు పుష్పాలతో జలాలకు స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. అరుణవర్ణంలో పరవళ్లు తొక్కుతూ వస్తున్న గోదావరి జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం చేశారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గోదావరి జలాలకు జలహారతి అనంతరం క్రాస్ రెగ్యులేటర్ వద్దకు చేరుకుని స్థానిక రైతులతో కలిసి రెగ్యులేటర్ గేట్లను ఎత్తారు. ప్రస్తుతం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన నీటితో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9.23 లక్షల మందికి తాగునీరు ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళిక చేసింది. తాండవ, వరహా, శారదా నదులతో పాటు ఏలేరు కాలువ లపై సైఫన్లు, ఆక్విడెక్టులను నిర్మించింది. ఎడమ కాలువ కోసం ఇప్పటి వరకూ రూ.4192 కోట్లను ప్రభుత్వం వ్యయం చేసింది. ఎడమ కాలువ ద్వారా వచ్చిన నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జల వనరుల శాఖ ప్రణాళిక చేసింది. గోదావరి జలాలతో పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరహా, మామిడి గెడ్డ ఆయకట్టు పరిధిలో ఉన్న 46,620 ఎకరాల స్థిరీకరణ జరుగనుంది. దీంతో పాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక అవసరాలకు, తాగు, సాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీల నీటిని తరలించేలా ప్రణాళిక చేసినట్టు సీఎంకు జల వనరుల శాఖ అధికారులు వివరించారు.

**ఉత్తరాంధ్రలో బీళ్లన్నీ ఇక పంటలే :** అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలు పండుతాయని అన్నారు. అనకాపల్లి జిల్లాలో అడుగుపెట్టి ఉత్తరాంధ్రకు తరలి వచ్చిన గోదారమ్మకు ప్రణమిల్లుతున్నానని తెలిపారు. గోదావరి మూడు పాయలు గౌతమి, వశిష్ఠ, వైనతేయ సముద్రంలో కలుస్తుంటే.. ఇప్పుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి తరలి వచ్చిందన్నారు. తూర్పు కనుమలు, అడవులు, నదులు, వాగులు, వంకలు, హైవేలను దాటుకుని అన్నవరం సత్య దేవుడి ఆశీస్సుల కోసం గోదారమ్మ ఇక్కడకు వచ్చిందని పేర్కొన్నారు. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు గోదావరి జలాలను తీసుకువెళతామని ఆపై అరసవల్లి సూర్యనారాయణ స్వామి వద్దకు తరలించి వంశధార వరకూ గోదావరిని జలాలను తరలిస్తామని చెప్పారు.

మిగతా 2లో...



# విద్యావ్యవస్థలో సమూల మార్పే లక్ష్యం

## ఉన్నత విద్య బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ

### పరిశ్రమలతో అనుసంధానం.. కరిక్యులమ్ ప్రక్షాళన

### నర్సరావుపేట జేఎన్‌టీయూ విద్యార్థులతో ముఖాముఖిలో లోకేష్



**నర్సరావుపేట (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని, యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు విలువలు, కష్టపడేతత్వం అలవర్చుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం కాకానిలోని జేఏఎన్ టీయూకే ఇంజనీరింగ్ కళాశాల నూతన వసతి గృహాలను ప్రారంభించిన అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో మంత్రి ముఖాముఖీ నిర్వహించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలు, కళాశాలల్లో అద్భుతమైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. అనేక కారణాల వ్యవస్థలు దెబ్బతిన్నాయి. విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి నేను ప్రయత్నిస్తున్నాను. అకడమిక్ కేలండర్ ప్రకారం అన్ని జరగాల్సిన అవసరం ఉంది.

మిగతా 2లో...

## విద్యార్థులకు.. అధునాతన వసతి

**జేఎన్‌టీయూకేలో మూడు నూతన హాస్టళ్ల ప్రారంభం**

**రూ.70 కోట్లతో నిర్మాణం.. మంత్రి లోకేష్ చేతుల మీదుగా**

2లో

## సొంతవాళ్లను చంపి.. మనపై నిందలా!

**గొడ్డలిపార్టీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి**

**డీఎస్సీపై నిజాలుంటే చర్చకు రండి.. స్థానిక ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలి**

**చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలే ప్రసక్తే లేదు: లోకేష్**

2లో

# మహిళల చేతుల్లో ప్రగతి చక్రం!

- **ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్తే లక్ష్యం: మంత్రి కొండపల్లి**
- **157 ఎంఎస్ఎంఈ పార్కులు.. రూ.8 వేల కోట్ల పెట్టుబడులు**
- **1.03 లక్షల మందికి ఉపాధి.. కొత్త పరిశ్రమలకు రూ.300 కోట్లు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళలు అందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదిగితేనే రాష్ట్రం, దేశంతో పాటు సమాజ ప్రగతిచక్రం మారుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ & ఆర్కిటెక్చర్ భవనంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ, ఇండియా ఎస్ఎంఈ ఫోరమ్ భాగస్వామ్యంతో జరిగిన

మిగతా 2లో...

## అయోధ్య రామాలయానికి కొత్త సారథి!



**అయోధ్య (జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ తొలి సీఈవోగా విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర ఎంపికయ్యారు. దాదాపు 39 ఏళ్లపాటు భారత వైమానిక దళంలో సేవలందించిన ఆయన.. ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు.

సీఈవో పోస్టు కోసం ముగ్గురు సభ్యులతో కూడిన ఎంపిక కమిటీ 5,585 దరఖాస్తులను పరిశీలించింది. అందులో 16 మందిని ఇంటర్వ్యూ చేసి.. ముగ్గురి పేర్లతో కూడిన తుది జాబితాను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు అందజేసింది. బుధవారం సమావేశమైన ట్రస్టు సభ్యులు జితేంద్ర మిశ్ర పేరును ఖరారు చేశారు.

మిగతా 2లో...

## ఐదు తరాల తర్వాత ఆడబిడ్డ!



- **200 ఏళ్ల తర్వాత వంశంలో తొలి అమ్మాయి జననం**
- **పూల రథంపై తల్లి, బిడ్డల ఊరేగింపు**
- **"మా ఇంటికి లక్ష్మీదేవే వచ్చింది" అన్న నానమ్మ**

**బీడ్:** మహారాష్ట్రలోని బీడ్ జిల్లా పర్లీకి చెందిన దహిఫలే కుటుంబంలో అరుదైన, భావోద్వేగ ఘట్టం చోటుచేసుకుంది. ఐదు తరాలుగా.. దాదాపు 200 ఏళ్ల తర్వాత ఆ వంశంలో తొలిసారిగా ఆడబిడ్డ జన్మించింది. దీంతో కుటుంబ సభ్యులు చిన్నారికి 'గార్గి' అని నామకరణం చేసి.. రాజకుమారిలా ఘనంగా స్వాగతం పలికారు.

మిగతా 2లో...

# నేతన్నలకు నూలే పెట్టుబడి!

- **ముందుగానే నూలు సరఫరా.. పెట్టుబడి భారం తగ్గించేలా చర్యలు**
- **36,632 దరఖాస్తుల్లో 10 రోజుల్లో అర్హుల ఎంపిక**
- **వీలైనంత వేగంగా రెండో విడత రూ.25 వేల సాయం: మంత్రి సవిత**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఇందులో భాగంగా పెట్టుబడిగా నూలు అందజేయనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. దీనివల్ల నేతన్నలపై పెట్టుబడి భారం పడకుండా ఉంటుందన్నారు. నేతన్నల సేవలో పథకం కింద కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పది రోజుల్లోగా లబ్ధిదారులను ఎంపిక చేసి, ఆర్థిక సాయం అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి షో రూమ్ ల్లో చేనేత ఉత్పత్తులు, హస్త కళారూపాల అమ్మకాలు పెంచాలని, రానున్న పండగల నేపథ్యంలో డిస్కౌంట్ సేల్స్ ప్రారంభించాలని ఆయా శాఖల అధికారులకు స్పష్టం చేశారు. ఖాదీ గ్రామీణా పారిశ్రామిభివృద్ధి బోర్డు ద్వారా అందజేసే స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుపై గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం చేనేత, జౌళి శాఖ, గ్రామీణ ఖాదీ బోర్డు అధికారులతో మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేత, హస్త కళకారులు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా

మిగతా 3లో...

# కొత్త జిల్లాల్లో ఉద్యోగ నియామకాలకు మార్గదర్శకాలు విడుదల

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్త జిల్లాల్లో ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ల నిర్వహణ, స్థానిక రిజర్వేషన్ల అమలుపై మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. విడుదల రాష్ట్రపతి ఉత్తర్వులు, 2025 ఆధారంగా సాధారణ పరిపాలన శాఖ కీలకమైన సమగ్ర ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. రాష్ట్రంలోని 26 జిల్లాలు, 6 జోన్లు, 2 మల్టీ జోన్లుగా పునర్వ్యవస్థీకరించబడిన నేపథ్యంలో ఉద్యోగ నియామకాలు, రోస్టర్ల నిర్వహణ, స్థానిక రిజర్వేషన్ల అమలుకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. జిల్లా, జోనల్, మల్టీ జోనల్ క్యాడర్ పోస్టుల ప్రత్యక్ష నియామకాల్లో స్థానిక అభ్యర్థులకు 95 శాతం రిజర్వేషన్ కేటాయించబడుతుందని, మిగిలిన 5 శాతం మాత్రమే ఓపెన్ కాంపిటీషన్ (ఓపెన్ కేటగిరీ) కిందకు వస్తాయని స్పష్టం చేసింది. పాత జిల్లాల్లో/జోన్లలో గతంలో ఎక్కడ నిలిచిపోయిందో అక్కడి నుంచే పాత రోస్టర్ కొనసాగుతుందని, విభజన ద్వారా ఏర్పడిన కొత్త జిల్లాల్లో/జోన్లలో రోస్టర్ పాయింట్-1 నుంచి తాజాగా ప్రారంభమవుతుందని పేర్కొంది. ఎస్సీలకు 200 పాయింట్ల రోస్టర్, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 100 పాయింట్ల రోస్టర్ అమలులో ఉంటాయని, గతంలో మిగిలిపోయిన క్యారీ-ఫార్వర్డ్ ఖాళీలను సంబంధిత కొత్త యూనిట్లలోని ఉద్యోగుల సంఖ్య ఆధారంగా క్రమపద్ధతిలో పంపిణీ చేసి, కొత్త రిక్రూట్‌మెంట్ కంటే ముందే భర్తీ చేస్తారని వెల్లడించింది. ప్రతి పోస్టు కేటగిరీని స్థానిక క్యాడర్, రిజర్వేషన్ వారీగా లెక్కించి ఆర్థిక శాఖ అనుమతితో ఏపీపీఎస్సీ, ఇతర నియామక బోర్డులకు ప్రతిపాదనలు పంపాలని శాఖాధిపతులను ఆదేశించింది.

# టీటీడీ డిప్యూటీ ఈఓ ఇంట్లో.. ఏసీబీ సోదాలు!

- **ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై తనిఖీలు**
- **ఏకకాలంలో ఏడు బృందాలతో సోదాలు**
- **బంగారం, వెండి, స్థిర, చరాస్తుల గుర్తింపు**



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం నివాసంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయన నివాసంతోపాటు ఏకకాలంలో ఆయన బంధువుల ఇళ్లలో తనిఖీ చేశారు. తిరుమలలోని బి-టైప్ క్వార్టర్స్‌లో ఉంటున్న లోకనాథం నివాసానికి ఎసిబి అధికారులు బుధవారం ఉదయం ఆరు గంటలకు చేరుకున్నారు.

మిగతా 2లో...

## విద్యార్థులకు.. అధునాతన వసతి



**నర్సరావుపేట (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లాలో బుధవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటించారు. నర్సరావుపేట మండలం కాకాని గ్రామంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నూతనంగా నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం రూ. 70కోట్ల వ్యయంతో 1,600మంది విద్యార్థినీ, విద్యార్థులకు అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన వసతి గృహాలను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం హాస్టల్ మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్ టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, మంత్రి గొట్టిపాటి రవికుమార్, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల చేతుల్లో ప్రగతి చక్రం!




(మొదటి పేజీ తరువాయి)

ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్‌లో కొండపల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త నినాదానికి అనుగుణంగా రాష్ట్రంలోని యువత, మహిళలు, డ్వాక్రా మహిళలు, నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

ఎంఎస్ఎంఈలతో దేశ జీడీపీలో 30 % ఆదాయంతో పాటు 50 %కు పైగా ఉద్యోగాల కల్పన జరుగుతోందన్నారు. నియోజకవర్గస్థాయిలో కూడా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నామని.. ఇప్పటికే 19 పార్కులు ప్రారంభించగా.. మరో 138 పార్కులు పురోగతిలో ఉన్నాయని.. వీటిద్వారా 2876 పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేసి రు. 8 వేల కోట్ల పెట్టుబడితో 1.03 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని కొండపల్లి పేర్కొన్నారు. ఇక కొత్త ఇండస్ట్రీల ఏర్పాటు కోసం సీఎంఈపీ పథకంలో రు. 300 కోట్లు కేటాయిస్తున్నట్టు మంత్రి చెప్పారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు అందజేస్తోందని.. వారు తీసుకునే డ్వాక్రా లోన్లపై ప్రతి యేడాది రు. 33, 500 వరకు ప్రాసెసింగ్ చార్జీలు ముఖ్యమంత్రి గారు రద్దు చేయించారని.. గ్రామీణ బ్యాంకుల వడ్డీని 13 % నుంచి 12 శాతంకు తగ్గించినట్టు తెలిపారు.

మరో అతిథి విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఒక మహిళ ఒక పారిశ్రామిక వేత్త అన్న ముఖ్యమంత్రి నినాదాన్ని నిజం చేయాలంటే మహిళలు అందరూ సబ్సిడీల గురించి ఆలోచించకుండా... ప్రభుత్వం ఇచ్చిన పెట్టుబడిని సద్వినియోగించుకుని విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదిగి.. మరి కొంతమందికి ఉపాధి కల్పించాలన్నారు. అప్పుడే దేశ రాష్ట్ర, దేశ జీడీపీ పెరుగడంతో పాటు ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్నారు. యువకుడు అయిన మంత్రి కొండపల్లి ఎంఎస్ఎంఈల అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్నారంటూ ప్రశంసించారు.

ఈ వర్క్‌షాప్‌లో మెటా, అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్, వాల్‌మార్ట్ వృద్ధి, సీఐఐ–నీతి ఆయోగ్ వంటి అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు మరియు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లు డిజిటల్ రంగానికి మారడం, ఈ–కామర్స్ సేవలు పొందడం, ఎగుమతుల అవకాశాలు పెంచుకోవడం, బ్యాంకింగ్ రుణాలు మరియు జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ సర్టిఫికేషన్ వంటి అంశాలపై హాజరైన వారికి అవగాహన కల్పించాయి. ఇక రాంప్ ప్రోగ్రామ్ కింద ఈ అవగాహన సదస్సులను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. విజయవాడ తర్వాత కృష్ణా, కాకినాడ, పల్నాడు మరియు గుంటూరు జిల్లాల్లో దశలవారీగా ఈ వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారాన్ని అందించనున్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ సీఈఓ విశ్వమనోహరన్, ఎంఎస్ఎంఈ ఈడీ సుధాకర్ జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## అయోధ్య రామాలయానికి కొత్త సారథి!



(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు ట్రస్టు నూతన ప్రధాన కార్యదర్శిగా గోవింద్ దేవ్ గిరి ఎంపికయ్యారు. మదన్‌మోహన్ పాండే (అయోధ్య), మహేశ్ భాగ్‌చంద్కా (ఢిల్లీ), డా.నిర్మలా యాదవ్ (శికోహాబాద్)లను కొత్త ట్రస్టీలుగా నియమించారు.

**పరిపాలన, ఆర్థిక వ్యవహారాలపై దృష్టి:** విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో అయోధ్య రామాలయ పరిపాలన, ఆర్థిక కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేసేందుకు ట్రస్టు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే తొలిసారిగా సీఈవోను నియమించింది.

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జితేంద్ర మిశ్ర 1986లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా చేరారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్టర్న్ ఎయిర్ కమాండ్‌కు నాయకత్వం వహించారు. ఆ సమయంలో అందించిన సేవలకు గుర్తింపుగా యుద్ధసేవా పతకం అందుకున్నారు.

ఆయన పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్ పూర్వవిద్యార్థి. వైమానిక దళంలో సుదీర్ఘ అనుభవం ఉన్న జితేంద్ర మిశ్ర.. ఇకపై రామాలయ పరిపాలన, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో కీలక బాధ్యతలు చేపట్టనున్నారు.

# బీళ్లలో ఇక.. గోదావరి పరవళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం ఎడమ కాలువ ద్వారా తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేలా ప్రణాళిక రూపొందించామని సీఎం తెలిపారు. తొలి దశలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని చంద్రబాబు తెలిపారు. మరో రూ.800 కోట్లు ఖర్చు చేసి మొత్తం పనులు పూర్తి చేస్తామన్నారు. ఏలేరు కాలువపై సైఫన్, పంపా, తాండవ, వరాహ నదులపై అక్విడెక్టులు నిర్మించి కాలువ పనులు పూర్తి చేశామని చెప్పారు. తాళ్లపాలెంలో భూ వివాదాన్ని పరిష్కరించి నిర్వాసితులకు పునరావాసం కల్పించామన్నారు. లెఫ్ట్ కెనాల్‌లో ప్రవహిస్తున్న ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం, ప్రభుత్వ సమర్థత ఉన్నాయని సీఎం పేర్కొన్నారు.




**కూటమి వచ్చాక పోలవరానికి శాప విముక్తి:** 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టు సాకారం కావడానికి ఏడు ముంపు మండలాలను రాష్ట్రంలో విలీనం చేసేలా కృషి చేశానని చంద్రబాబు తెలిపారు. ప్రతి సోమవారాన్ని పోలవారంగా మార్చుకుని 2019 వరకు 72 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. డయాఫ్రాం వాల్ కొట్టుకు పోయిందని అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించడం ద్వారా ప్రజలే పోలవరానికి శాప విముక్తి కల్పించారని అన్నారు. రాష్ట్రంలో ఏ మంచి జరిగినా తామే చేశామంటూ గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారానికి పాల్పడుతోందని అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు, వెలిగొండ ప్రాజెక్టులు తామే కట్టామని చెప్పుకుంటోందని అన్నారు. ప్రజలు ఛీ కొట్టినా ఆ పార్టీకి సిగ్గు రావటం లేదన్నారు. అనకాపల్లికి నీరు కూడా తామే చేశామని చెప్పుకుంటారని పోలవరం పూర్తి అయితే మా గొప్పే అంటారన్నవారు. నేర చరిత్ర ఉన్న గొడ్డలి పార్టీది విధ్వంసమే అసలు నైజమని ముఖ్యమంత్రి అన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకురావడం అంత సులభంగా జరగలేదని, గంటలు, రోజుల వారీగా లక్ష్యాలు పెట్టుకుని పనులు పరుగులు పెట్టించామని తెలిపారు. ఎడమ ప్రధాన కాలువను మరింత విస్తరించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు చెప్పారు. రూ. 3,200కోట్లతో ఉత్తరాంధ్రలోని 12 ప్రధాన ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. వచ్చే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. గత రెండేళ్లలో సాగునీటి రంగంలో రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. గోదావరి– కృష్ణా సహా రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జల హారతి ఇస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. చంద్రబాబు అనే నేను 2015 సెప్టెంబరు 16న పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణాడెల్టాకు తీసుకెళ్ళానని.. 2017 ఆగస్టు 15న పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ప్రారంభించామని గుర్తుచేశారు. ఇప్పుడు చంద్రబాబు అనే నేను 2026 సెప్టెంబరు 2న గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకువచ్చానని ముఖ్యమంత్రి అన్నారు. తాను సీఎంగా ఉన్న ప్రతిసారీ సాగునీటి ప్రాజెక్టులు, నీటి సంరక్షణ కోసమే పనిచేశానని వివరించారు.

**ఇక ఉత్తరాంధ్రకే వలసలు :** నీరు పుష్కలంగా ఉంటే పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధికి భద్రత ఉంటుందని సీఎం చెప్పారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లో భారీ పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. ఆరు నెలల క్రితం అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. పెద్ద డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు వస్తున్నాయని, ఆసియా మొత్తాన్ని అనుసంధానించే సబ్‌సీ కేబుల్ కనెక్టివిటీ కూడా రానుందని తెలిపారు. హార్బర్లు, మూలపేట పోర్టుల ద్వారా తూర్పు తీరాన్ని మధ్య భారత్‌తో అనుసంధానిస్తామన్నారు. హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి తరహాలో అనకాపల్లి అభివృద్ధికి చిరునామాగా మారుతుందని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లడం కాదు.. ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి వస్తుందని. ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుందని ముఖ్యమంత్రి వివరించారు. విశాఖ ఇక ఏఐ పట్నంగా మారుతుందని సీఎం తెలిపారు. గూగుల్ హబ్‌గా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుందని చెప్పారు. డేటా సెంటర్లకు నీరు, విద్యుత్ కొరత వస్తుందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటితో పోలిస్తే పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే నీటి సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అన్ని డేటా సెంటర్లకూ కేవలం 5 టీఎంసీల నీరు సరిపోతుందని.. ఎడమ కాలువ ద్వారా రోజుకు 2 టీఎంసీల నీరు తీసుకెళ్లే సామర్థ్యం ఉందని అన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు సభా వేదిక నుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి.. ఎడమ కాలువను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన జలవనరులశాఖ ఇంజనీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు సహా మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, పి.నారాయణ, కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కె.పార్థసారథి, ఎంపీలు విజయ్, సీఎం రమేశ్ సహా ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

# విద్యావ్యవస్థలో సమూల మార్పే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గత రెండేళ్ల కాలం పాఠశాల విద్య బలోపేతానికి చర్యలు తీసుకున్నాం. అనేక సత్ఫలితాలు వచ్చాయి. నేను మంత్రి అయినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఉన్నత విద్యపైనా దృష్టి పెట్టాం. ల్యాబ్స్, స్కిల్ సెంటర్స్, పరిశ్రమలతో అనుసంధానంపై దృష్టి పెట్టాం. ఇంజనీరింగ్ నాలుగేళ్లు చదివిన తర్వాత ఉద్యోగాలు రావాలి. అందుకే కాలేజీలను పరిశ్రమలతో అనుసంధానం చేస్తున్నాం. ఇవన్నీ ఒక్కరోజులో జరగవు.

**విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావడమే లక్ష్యం :** విద్యావ్యవస్థలో మార్పు రావాలంటే కనీసం పదేళ్లు పడుతుంది. నేను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేసినప్పుడు చాలా సులభంగా ఉండేది. విద్యాశాఖలో ఆ విధంగా చేయలేం. విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది భాగస్వామ్యం కావాలి. ఒక ఎకోసిస్టమ్ ను నిర్మించాలి. విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలనేది నా డ్రీమ్. ప్రజాప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకువస్తున్నాం. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సిమెంట్, స్టీల్, గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ వంటి క్లస్టర్లను ఏర్పాటుచేస్తున్నాం. జీవితంలో ఏదైనా సాధించాలంటే యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

**కరిక్యులమ్ ను ప్రక్షాళన చేస్తున్నాం :** రాష్ట్రంలో కియా, హీరో మోటార్స్ వంటి కంపెనీలు వచ్చాయి. త్వరలో మరిన్ని కంపెనీలు రాబోతున్నాయి. ఆటోమోటివ్ రంగంలో అనేక పరిశ్రమలను తీసుకువచ్చాం. ఫిజిక్స్, మెటీరియల్ సైన్సెస్, స్పేస్, థర్మోడైనమిక్స్ వంటి సబ్జెక్టులపైనా దృష్టిసారించాలి. దేశంలో ఐఐటీ, ఎన్ఐటీలు చాలా బలంగా ఉన్నాయి. ఎందుకంటే ఆయా కాలేజీల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. రాష్ట్రంలో కూడా ఉన్నత విద్య బలోపేతానికి కృషిచేస్తున్నాం. టీచర్లు, విద్యార్థులు ఎంత మంది ఉన్నారో తెలియని పరిస్థితి. వీటన్నింటినీ డిజిటైజ్ చేస్తున్నాం. హాజరును సమీక్షిస్తున్నాం. రీసెర్చ్ పైనా దృష్టిసారిస్తున్నాం. దీర్ఘకాలిక ప్రణాళికలతో పాటు సత్వర ఫలితాల సాధనకు కసరత్తు చేస్తున్నాం. మరోవైపు పరిశ్రమల నిపుణులతో సంప్రదించి కరిక్యులమ్ ను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. మనం నేర్చుకున్నది పరిశ్రమకు దగ్గరగా ఉండాలి. ప్లేస్ మెంట్స్ విషయంలో కూడా ప్రతి యూనివర్సిటీకి కీ ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు(కేపీఐ) తీసుకువస్తున్నాం.

**పల్నాటి ప్రజల అభిమానం మర్చిపోలేనిది :** పల్నాడుకు, అనకాపల్లికి తేడా ఏంటని ఈ సందర్భంగా ఓ విద్యార్థినిని మంత్రి ప్రశ్నించారు. అనకాపల్లిలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, ఇక్కడ వరి పండిస్తే.. అక్కడ చెరకు పండిస్తారని సదరు విద్యార్థిని బదులిచ్చారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ యువగళం అనుభవాలను గుర్తుచేసుకున్నారు. పల్నాడులో పాదయాత్ర చేస్తున్నప్పుడు మా కార్యకర్త నా చేయి తీసుకున్నాడు. ప్రేమ చూపిస్తున్నాడేమో అని భావించా. కానీ నా చేతిని కొరికాడు. ప్రేమను వ్యక్తం చేయడం తెలియక అలా చేశాడు. ఇక్కడివారు ప్రేమను, అభిమానాన్ని మొరటుగా చూపిస్తారు. మరోవైపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకువెళ్లడం జరుగుతోంది.



సీఎం గారు బుధవారం ఆ కార్యక్రమం కోసమే వెళ్లారు. వెలిగొండ ప్రాజెక్ట్ మొదటిదశను పూర్తిచేసుకోవడం జరిగింది. ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ అనకాపల్లికి వచ్చిందన్నారు.

**విలువలు లేని వికసిత్ భారత్.. వికసిత్ భారత్ కాదు :** విలువలు లేని వికసిత్ భారత్.. వికసిత్ భారత్ కాదు. నేను స్టాన్ ఫోర్డ్ లో విలువలు నేర్చుకున్నాను. స్టాన్ ఫోర్డ్ లో పరీక్షలు రాసే సమయంలో ఇన్విజిలేటర్లు ఉండరు. ఎవరూ కాపీ కొట్టరు. దీనివల్ల వ్యక్తిత్వం నిర్మితమవుతుంది. అవకాశాలు అనేకం ఉన్నాయి. అయితే కష్టపడాలి. విజయానికి దగ్గరి దారులు లేవు. కష్టపడటం ఒక్కటే మార్గం. ధీరూభాయ్ అంబానీ ఎంత కష్టపడ్డారో అందరం చూశాం. ముఖేష్ అంబానీ, అదానీ, ప్రధాని మోదీ, మన ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఎంతో కష్టపడతారు. 76 ఏళ్ల వయసులోనూ 18 గంటల పాటు కష్టపడతారు. మనం కూడా అదేవిధంగా కష్టపడాలి. నేను అనేక దేశాలు చూశాను. ఏ దేశంలో చూసినా కనీసం రెండు జనరేషన్లు త్యాగం చేశారు. అంటే కష్టపడ్డారు. సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, రష్యాలో దీనిని చూశాను. సింగపూర్ ను లీన్ క్వాన్ యూ ఏవిధంగా మార్చారో మనం చూశాం.

**యువత విలువలు, కష్టపడేతత్వం అలవర్చుకోవాలి :** యువత విలువలు, కష్టపడేతత్వం అలవర్చుకోవాలి. ప్రభుత్వం నుంచి మేం చేయాలో అది చేస్తాం. అవకాశాలు కల్పిస్తాం. పరిశ్రమలు తీసుకువస్తున్నాం. ఇందుకు పరిశ్రమలకు అనేక రాయితీలు ఇస్తున్నాం. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. ప్యాషన్ లేకపోతే మనం విజయం సాధించలేం. రాజకీయాలంటే ప్యాషన్ ఉంది కాబట్టే 24 గంటలు కష్టపడుతున్నా. కుటుంబాన్ని వారానికోసారి మాత్రమే కలుస్తా. చంద్రబాబు గారు 18 గంటలు కష్టపడుతుంటే నేను కనీసం 20 గంటలైనా కష్టపడాలి కదా.

**యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం :** యువగళం పాదయాత్రలో నేను ప్రతిరోజూ నేర్చుకున్నాను. స్టాన్ ఫోర్డ్ ఎంబీయే బిజినెస్ కు పనికిరాగా.. పాదయాత్ర రాజకీయాల్లో పనికివచ్చింది. ప్రజల సమస్యలు బాగా అర్థం చేసుకోగలుగుతున్నా. పాదయాత్రలో వచ్చిన ఆలోచనే 20 లక్షల ఉద్యోగాల కల్పన. ఇందుకోసం అందరం అహర్నిశలు కష్టపడతామని మంత్రి వివరించారు.

## టీటీడీ డిప్యూటీ ఈఓ ఇంట్లో..
# ఏసీబీ సోదాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో ఆయన నివాసంతోపాటు క్యాంపు కార్యాలయం, తిరుపతి పెద్దకాపు వీధిలోని నివాసం, తిరుపతిలోని లోకనాథం ఇద్దరు బావమరుదుల ఇళ్లు, ఏర్పేడు మండలం చెల్లూరులోని ఆయన సోదరుడి నివాసంతోపాటు మరో ప్రాంతంలోనూ సోదాలు నిర్వహించారు. తిరుపతి ఎస్‌టివి నగర్ ఎస్‌బిఐ బ్రాంచ్ లాకర్లను పరిశీలించారు. ఎసిబి డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సోదాలు జరిగాయి. అధికారులు ఏడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, స్థిర, చరాస్తులు గుర్తించినట్లు సమాచారం. లోకనాథం విధులకు సంబంధించిన వ్యవహారాలు, ఆదాయానికి మించిన ఆస్తులు, ఇతర అక్రమాలపై ఎసిబి అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సోదాలు పూర్తైన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని డిఎస్‌పి తెలిపారు. 2011లో అప్పటి టిటిడి డిప్యూటీ ఇఒ భూపతిరెడ్డి నివాసంలో ఎసిబి సోదాలు నిర్వహించింది. సుమారు 15 ఏళ్ల తర్వాత తిరిగి అదే స్థాయి అధికారి నివాసంలో తనిఖీలు చేయడం తీవ్ర కలకలం రేపింది.

## ఐదు తరాల తర్వాత ఆడబిడ్డ!

(మొదటి పేజీ తరువాయి)

**రథంపై ఊరేగింపు :** ఆసుపత్రి నుంచి తల్లి కల్పనా రిషికేష్ దహిఫలే, చిన్నారి గార్గి డిశ్చార్జ్ అయిన సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూలతో అలంకరించిన రథంపై తల్లి, బిడ్డలను కూర్చోబెట్టి.. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. ఈ వేడుకను స్థానికులు సైతం ఆసక్తిగా తిలకించారు.

**తాతయ్య ఆనందబాష్పాలు :** చిన్నారిని ఇంటికి తీసుకురాగానే తాతయ్య లింబాజీ దహిఫలే భావోద్వేగానికి లోనయ్యారు. తమ వంశంలో ఆడపిల్ల జన్మించడం గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. ఇన్నాళ్లుగా తమ మనసులో ఉన్న పెద్ద వెలితి ఈ రోజుతో తీరిపోయిందంటూ ఆనందం వ్యక్తం చేశారు. "మా ఇంటికి సాక్షాత్తూ లక్ష్మీదేవే నడిచి వచ్చింది" అంటూ నానమ్మ సురేఖ దహిఫలే సంతోషం వ్యక్తం చేశారు.

**ఆడపిల్ల పుట్టడం.. పండగే! :** ఆడపిల్ల పుడితే భారంగా భావించే పరిస్థితులు ఇంకా కొన్ని చోట్ల కనిపిస్తున్నాయని దహిఫలే కుటుంబ సభ్యులు అన్నారు. అమ్మాయి జననం గర్వించదగిన విషయమని.. ఆడబిడ్డ పుట్టిన వేళను ఉత్సవంలా జరుపుకోవాలనే సానుకూల సందేశాన్ని సమాజానికి అందించేందుకే ఈ వేడుకను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

# సొంతవాళ్లను చంపి.. మనపై నిందలా!

**నర్సరావుపేట (జర్నలిస్ట్ ఫైల్) :** 2019లో బాబాయిని కిరాతకంగా చంపేసి, చంద్రబాబు చేతిలో కత్తిపెట్టి నారాసుర రక్తచరిత్ర అని అవినీతి విషపుత్రిక సాక్షి పేపర్ లో రాశారు. అదేమని అడిగితే చిన్నపిల్లాడు, తెలియక చంపేశాడని తమ తమ్ముడిని సమర్థించడం జగన్ రెడ్డికే చెల్లుతుందని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఎద్దేవా చేశారు. నర్సరావుపేట నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ... మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం రెంటచింతలలో ఒక చెన్నారెడ్డి అనే వ్యక్తి చనిపోతే, ఏపీలో జంగిల్ రాజ్ అని జగన్ ట్వీట్ వేశారు. జగన్ చెన్నారెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డికి ఫోన్ చేసి బ్రహ్మారెడ్డి చంపాడు కదా అంటే గొడ్డలి పార్టీ కార్యకర్తలే తన బిడ్డను చంపారని చెప్పాడు. బాబాయిని, సొంత కార్యకర్తలను చంపి, ఆ నెపాన్ని మనపై వేసే ప్రబుద్ధుడు జగన్. తెలుగుదేశం పార్టీకి తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బిసి సెల్ వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయి. గొడ్డలిపార్టీకి గంజాయి, బూతులు, మహిళలను అవమానించే అనుబంధ విభాగాలున్నాయి. తెలుగుదేశం పార్టీలో రెండోతరం, మూడోతరం వచ్చింది. వైసిపిలో భూకబ్జాలు, హిట్ అండ్ రన్, భార్యను వేధించే నాయకులు వచ్చారు. గొడ్డలిపార్టీ అరాచకాలన్నింటినీ ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది. వైసిపి దుష్ప్రచారాలను టిడిపి కేడర్ సమర్థవంతంగా తిప్పికొట్టాలి.

**పార్టీ కోసం పనిచేస్తే పదవులు వెదుక్కుంటూ వస్తాయి :** పల్నాడుకు ముఖద్వారం, పౌరుషాల పురిటిగడ్డ నర్సరావుపేట. ఎంతోమంది గొప్పనాయకులను తయారుచేసిన నేల నర్సరావుపేట. ఏపీకి తొలి స్పీకర్ వెంకట్రామయ్య చౌదరి. ఉమ్మడి రాష్ట్ర 3వ సిఎం కాసు బ్రహ్మానందరెడ్డి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాష్ట్రవిభజన తర్వాత తొలి స్పీకర్ గా పనిచేసిన పల్నాడు పులి కోడెల శివప్రసాద్ వంటి నేతలను అందించిన ఈ నేల అభివృద్ధికి కారణం తెలుగుదేశం పార్టీ. టిడిపి ఆవిర్భావానికి ముందు పల్నాడు అంటే ఫ్యాక్షనిజంగా పేరుండేది. కోడెల ఎమ్మెల్యే అయ్యాక ఫ్యాక్షన్ కు ఫుల్ స్టాప్ పెట్టారు. అభివృద్ధి చేసి చూపించారు. 2019లో ఓడిపోయినా అరవిందబాబు కార్యకర్తలకు అండగా నిలబడి తిరిగి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎంపి, ఎమ్మెల్యే అద్భుతంగా కలసికట్టుగా ముందుకు సాగుతున్నారు. తెలుగుదేశం పార్టీలో వర్గాలు ఉండవు. తెలుగుదేశం అనే ఒకే ఒక వర్గం మాత్రమే ఉంటుంది. వర్గాలపేరుతో కావాలని కొందరు చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తారు. అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండండి. నేను ఈరోజు రాష్ట్రమంత్రిగా మీ ముందు నిలబడటానికి కారణం తెలుగుదేశం. కార్యకర్తలు నాతో లేకపోతే నేను ఎవరు? పనిచేసే కార్యకర్తలను గుర్తించే బాధ్యత నాది. 2025 మహానాడులో నా మనసుకు దగ్గరైన శాసనం కార్యకర్తే అధినేత. పార్టీ ఆవిర్భావం రోజున కార్యకర్తలను అధినేత పక్కన కూర్చోబెట్టాం. మంత్రులంతా కింద కూర్చున్నారు. పార్టీ కోసం మీరు పనిచేస్తే ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేదు, పదవులు వెదుక్కుంటూ మీవద్దకు వస్తాయి.

**డిఎస్సీ ఆరోపణల్లో నిజం ఉంటే నిలబడి నిరూపించాలి :** డిఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి ప్రతిపక్ష నేతగా ఉండటం రాష్ట్రప్రజల దౌర్భాగ్యం. 150కేసులు వేసినా 150రోజుల్లో విజయవంతంగా మెగా డిఎస్సీ నిర్వహించి 16వేల టీచర్ పోస్టులు భర్తీచేశాం. రాబోయే రోజుల్లో మరో 3డిఎస్సీలు ఇచ్చి టీచర్ పోస్టులు భర్తీచేసే బాధ్యత నాది. డిఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్ తో చర్చకు నేను రెడీ. ఆరోపణలు చేసి పారిపోవడం కాదు, వారి ఆరోపణల్లో వాస్తవాలు ఉంటే ధైర్యంగా నిలబడి నిరూపించాలి. రాష్ట్రంలో గ్రూప్ –1, గ్రూప్ –2 పోస్టులు భర్తీచేసే బాధ్యత కూడా నేను తీసుకుంటా. లక్షలాది యువత కలలు నెరవేరుస్తా. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల గురించి నేను చెప్పాల్సిన పనిలేదు.

**కార్యకర్తలకు ఉచితంగా మందులు అందిస్తాం :** కార్యకర్తల సంక్షేమం కోసం రూ. 160కోట్లు ఖర్చుపెట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశం. తెలుగుదేశం పార్టీ కోటిమంది సభ్యులు గల అతి పెద్ద కుటుంబం, సమస్యలు ఉంటే నాలుగు గోడల మధ్య పరిష్కరించుకుందాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి బూత్ కీలకమైంది. మై టిడిపి యాప్ ద్వారా పనిచేసే కార్యకర్తలను గుర్తించి, నామినేటెడ్ పదవులు ఇస్తాం. పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమం



విజయవంతం చేయండి. చేసిన పనిని మైటిడిపి ద్వారా తెలియజేయండి. క్లస్టర్, యూనిట్ నాయకులకు కేంద్ర కార్యాలయంలో ట్రైనింగ్ ఇచ్చాం. శిక్షణకు వచ్చిన వారికి రక్తపరీక్షలు చేయిస్తే, 75శాతం మందికి వివిధ వ్యాధులు ఉన్నాయి. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తాం. జీవితాంతం వారికి మందులు అందించే బాధ్యత నాది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలు అందరిపైనా ఉంది.

**బిసిలకు తీరని ద్రోహం చేసిన జగన్ :** జగన్ సిఎం అయ్యాక స్థానిక సంస్థలకు బిసిలకు 10శాతం రిజర్వేషన్ తగ్గించి, 17వేల పదవులకు దూరం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బిసిలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ క్యాబినెట్ తీర్మానం చేశాం. వాటిని కూడా వైసిపి నేతలు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూస్తున్నారు. 2019–24 నడుమ బిసి బిడ్డలను అతి కిరాతకంగా వైసిపి నాయకులు చంపేశారు. తన అక్కను ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ ను కిరోసిన్ పోసి తగులబెట్టారు. తోటచంద్రయ్య, నందం సుబ్బయ్యలను దారుణంగా హతమార్చారు. మాజీ మంత్రి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేసి, పారిపోయాడు. అప్పలరాజు మరొక వ్యక్తిని ప్రవేశపెట్టాడు. చనిపోయింది యాదవ సామాజికవర్గ వ్యక్తి. కనీసం ఆ కుటుంబాన్ని ఆదుకోలేదు. జగన్ బడా చోర్ అయితే...కారుమూరు నాగేశ్వరరావు చోటా చోర్. మద్యం రవాణాలో అక్రమ సొమ్ము కోడలు ఎకౌంట్ లో జమచేశాడు. ఈ కేసులో ఈడి ఆయనను జైలుకు పంపితే మనపై నెపం వేస్తున్నారు. వైసిపి దుష్ప్రచారాలపై కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండాలి.





# కూటమి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి





- **ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వెల్లడి**
- **ఆలపాటి సమక్షంలో వైసీపీ, కాంగ్రెస్ నాయకుల చేరిక**

**తెనాలి, సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందని తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి-సంక్షేమం' ఇంటింటి ప్రచారంలో భాగంగా పట్టణంలోని 7, 8 వార్డుల్లో కూటమి నాయకులు, అధికారులతో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వార్డుల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు.

ఆలపాటి పర్యటన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీ, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు నరేంద్రకుమార్, సునీల్, రమేష్, బాబు బ్రదర్స్ ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ దేశంలోని మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పోలవరం ప్రాజెక్టుతో పాటు రాష్ట్రానికి అవసరమైన రాజధానిని అన్ని హంగులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. బీసీల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ రైతులకు సబ్సిడీపై ఎరువులు, యంత్రాలు అందించడంతో పాటు రైతు భరోసా, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆలపాటి తెలిపారు. అర్హులైన వారికి ప్రతి నెలా ఒకటో తేదీనే రూ. 4 వేల నుంచి రూ. 15 వేల వరకు వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 95 పథకాల్లో 85 పథకాలను కూటమి ప్రభుత్వం తిరిగి అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## నేతన్నలకు నూలే పెట్టుబడి!



(మొదటి పేజీ తరువాయి)

పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు. చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేసేలా ఇప్పటికే పలు పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేసేలా నేతన్నల సేవలో పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ పథకం అమలులో భాగంగా తొలి విడతగా 71,536 మంది నేతన్నలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. అర్హులైన మరింత మందికి ఈ పథకాన్ని వర్తింపజేయాలన్న ఉద్దేశంతో దరఖాస్తులు స్వీకరించగా, 36,632 మంది అప్లయ్ చేసుకున్నారన్నారు. రాబోయే పది రోజుల్లో వారిలో అర్హులను గుర్తించి, వీలైనంత తొందరగా రెండో విడత నేతన్నల సేవలో పథకం ద్వారా వారికి ఆర్థిక సాయం అందించాలని చేనేత, జౌళి శాఖాధికారులను ఆదేశించారు.

**పెట్టుబడిగా నూలు సరఫరా :** చేనేత వస్త్రాల తయారీలో ముఖ్యమైన నూలును పెట్టుబడిగా రుణ రూపేణా సరఫరా చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. నేతన్నలు తయారు చేసిన చేనేత ఉత్పత్తులు కొనుగోలు చేసిన తరవాత ఆప్కో అధికారులు సరఫరా చేసిన నూలు మొత్తాన్ని మినహాయించుకుని మిగిలిన చెల్లింపులు చేయాలన్నారు. ముందుగా నూలు అందజేయడం వల్ల నేతన్నలపై పెట్టుబడి భారం తగ్గుందని మంత్రి సవిత తెలిపారు.

**6న పెనుకొండలో ఆప్కో షో రూమ్ ప్రారంభం :** ఆప్కో, లేపాక్షి షో రూమల్లో చేనేత ఉత్పత్తులు, హస్త కళారూపాల విక్రయాలు పెంచాలని మంత్రి సవిత ఆదేశించారు. చేనేతలు, హస్త కళాకారులకు 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలో అవసరమైన చోట ఆప్కో, లేపాక్షి షో రూమ్ లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల ఆరో తేదీన పెనుకొండలో ఆప్కో షో రూమ్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టులో కూడా ఆప్కో, లేపాక్షి షో రూమ్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న పండగల నేపథ్యంలో చేనేత, హస్త కళలపై డిస్కౌంట్ సేల్స్ ప్రారంభించాలని మంత్రి సవిత తెలిపారు.

**ఉపాధి యూనిట్లపై అవగాహన సదస్సులు :** ఖాదీ గ్రామీణా పారిశ్రామిభివృద్ధి బోర్డు ద్వారా అందజేసే స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయిదేళ్లలో రాష్ట్రంలోని 20 లక్షల మంది యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మేనిఫెస్టోలో తెలిపిందన్నారు.

## ఘనంగా ముగిసిన వివిఐటియు మహిళల క్రికెట్ టోర్నమెంట్



- **విజేతగా ఆతిథ్య వివిఐటియు జట్టు**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్‌కే ప్రసాద్ గ్రౌండ్స్‌లో మూడు రోజులుగా ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించిన మహిళల క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. మొత్తం ఎనిమిది కళాశాలల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఆతిథ్య వివిఐటియు జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది.

ఫైనల్ పోరులో వివిఐటియు, విష్ణు విశ్వవిద్యాలయ జట్లు తలపడగా మ్యాచ్ చివరి వరకు హోరాహోరీగా సాగింది. ఉత్కంఠభరిత పోరులో వివిఐటియు జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విష్ణు విశ్వవిద్యాలయ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మూడు రోజుల పాటు జరిగిన పోటీలు క్రీడాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ముగింపు కార్యక్రమానికి వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరై విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ ఎన్. అరుణ్‌కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసన

- **సెప్టెంబరు 5న నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన: ఆప్టా**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడాన్ని నిరసిస్తూ సెప్టెంబరు 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య పిలుపునిచ్చింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో అన్ని పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సమాఖ్య జాతీయ అధ్యక్షుడు బసవరాజు గురికర్, ప్రధాన కార్యదర్శి కమల్కాంత్ త్రిపాఠి సూచించారు.

ఏఐపిటీఎఫ్ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పాఠశాలల్లో సెప్టెంబరు 5న ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. జి. మెహదీ, ఏఐపిటీఎఫ్ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ. జి. ఎస్. ఎస్. గణపతిరావు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మూడు పర్యాయాలు, సుశీల్ జోషిని రెండు పర్యాయాలు, కుమార్‌స్వామితో పాటు ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఒకసారి కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా పార్లమెంటులో చట్టం చేయాలని జూలై, ఆగస్టు నెలల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంపీలను కూడా కలిసి కోరినట్లు ఏఐపిటీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో సెప్టెంబరు 5న నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే అక్టోబరు 6 నుంచి 9వ తేదీ వరకు ఢిల్లీలో కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసి వినతిపత్రాలు సమర్పించడంతో పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏఐపిటీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎ. జి. ఎస్. గణపతిరావు తెలిపారు.

## ఆర్టీసీ జోనల్ స్టోర్స్‌లో తొలగించిన 17 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- **ఏఐటీయూసీ డిమాండ్**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ వర్క్‌షాప్‌లోని జోనల్ స్టోర్స్‌లో దాదాపు పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న 17 మంది కార్మికులను ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసు లేకుండా విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారిని తిరిగి విధుల్లోకి తీసుకుని ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యపై ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకట సుబ్బయ్య బుధవారం విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోనల్ స్టోర్స్‌లో సంవత్సరాల తరబడి పనిచేస్తూ ఆర్టీసీ కార్యకలాపాలకు సేవలందించిన 17 మంది కార్మికులను ఒక్కసారిగా విధుల నుంచి తొలగించడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. దాదాపు పదేళ్లుగా నిరంతరంగా పనిచేసిన వారి సేవా కాలం, అనుభవం, సంస్థకు అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఎలాంటి ముందస్తు నోటీసు, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశం కల్పించకుండా తొలగించడం వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు.

సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను అకస్మాత్తుగా విధుల నుంచి తొలగించి వారి కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం సరికాదని వెంకట సుబ్బయ్య అన్నారు. కార్మికుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి, విజయవాడ జోనల్ స్టోర్స్‌లో తొలగించిన 17 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్మికుల సమస్యను సానుకూలంగా పరిశీలించి తక్షణమే న్యాయం చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బాజీ, కార్మికులు రాము, శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

## ఉద్యోగుల హక్కుల కోసం చేయి చేయి కలుపుదాం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన తొలి దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న 'హ్యాండ్ టు హ్యాండ్' కార్యక్రమాలకు ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభిస్తోందని సంఘం రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఉద్యమ కమిటీ చైర్మన్ టి. వి. ఫణి పేర్రాజు తెలిపారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 8వ తేదీ వం-కు జిల్లా కేంద్రాలు, డివిజన్ స్థాయిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో భాగంగా బుధవారం వివిధ జిల్లాల కేంద్రాలు, డివిజన్ పరిధిలోని కార్యాలయాలను ఏపీ జేఏసీ అమరావతి నాయకులు సందర్శించి ఉద్యోగులను నేరుగా కలిశారు. ఉద్యమానికి దారితీసిన పరిస్థితులు, ప్రభుత్వంతో జరిగిన చర్చలు, ప్రభుత్వం నుంచి వచ్చిన స్పందన తదితర అంశాలను ఉద్యోగులకు వివరించి, ప్రతి ఉద్యోగి ఉద్యమంలో భాగస్వామి కావాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లను ఐక్య ఉద్యమంలో భాగస్వాములను చేయడమే 'చేయి చేయి కలుపుదాం' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ నెల 3న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యలు ఇక వాయిదా పడకూడదని, హక్కులను కాపాడాలని, పెండింగ్‌లో ఉన్న తమ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమమే కీలకమని పేర్కొంటూ ఏపీఎన్జీవో జేఏసీతో పాటు ఏపీ సచివాలయ ఉద్యోగ సంఘాలు, యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్, ఆపస్ తదితర ఉపాధ్యాయ సంఘాలు, అలాగే ప్రభుత్వ గుర్తింపు పొందిన, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్యత్వం ఉన్న మొత్తం 43 ఉద్యోగ సంఘాలకు ఐక్య ఉద్యమంలో కలిసి రావాలని కోరుతూ లేఖలు పంపినట్లు బొప్పరాజు, పలిశెట్టి తెలిపారు. సంఘాలు వేరైనా సమస్యలు ఒక్కటేనని, జెండాలు వేరైనా లక్ష్యం ఒక్కటేనని పేర్కొంటూ ఉద్యోగుల హక్కుల కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు. రానున్న తరాలకు న్యాయం దక్కాలంటే ఉద్యోగుల హక్కుల కోసం ఇప్పుడే గొంతెత్తాలని, 3న నిర్వహించే భోజన విరామ నిరసనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# బదిలీల నిర్వహణపై పాలసీని రూపొందిస్తాం

- **ఆర్థికేతర సమస్యల పరిష్కారంపై త్వరగా ఉత్తర్వులిస్తాం**
- **నిర్ణయాత్మక కమిటీలో జేఏసీ ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తాం**
- **ఆందోళనను వాయిదా వేయాలి**
- **జెఏసి కాంట్రాక్ట్ ఉద్యోగులకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ విజ్ఞప్తి**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** బదిలీల నిర్వహణపై నిర్దిష్టమైన విధానాన్ని(పాలసీ) రూపొందిస్తామని కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)కి వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ హామీ ఇచ్చారు. ఇందులో బదిలీలు ఎలా, ఎప్పుడు ఏయే కేటగిరీ (మ్యూచువల్, విజ్ఞప్తులు, స్పౌజ్, ఇతర) ఎటువంటి పద్ధతుల్ని అవలంబించాలన్న దానిపై పాలసీని తయారు చేస్తామని చెప్పారు. ఈ బదిలీలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం అధికారికంగా ఏర్పాటు చేసే కమిటీలో జెఏసి సభ్యులను కూడా భాగస్వాములను చేస్తామని వెల్లడించారు. ఆర్థికేతర సమస్యల్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

అయితే, ఉద్యోగ సర్వీసుల క్రమబద్ధీకరణ, 100 శాతం గ్రాస్ వేతన చెల్లింపు తమ పరిధిలో లేదని, ప్రభుత్వ పరంగా విధానపరమైన నిర్ణయం జరగాల్సి ఉందని చెప్పారు. జెఏసి విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, ఉన్నత స్థాయిలో చర్చించేందుకు తగిన సమయం అవసరమైనందున ఆందోళన కార్యక్రమాలను నెల రోజుల పాటు వాయిదా వేయాలని, రోగులు ఇబ్బందులు పడకూడదని జెఏసి ప్రతినిధులను కోరారు.

తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ప్రధాన కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 3 గంటల పాటు రెండో విడత జేఏసీ ప్రతినిధులతో కార్యదర్శి జి. వీరపాండియన్‌తో పాటు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్‌బాబు, ఆయుష్ కమీషనర్, వైద్య,ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వీరపాండియన్ మాట్లాడుతూ మెటర్నిటీ, చైల్డ్ కేర్, మెడికల్ లీవులు, ఇతర విజ్ఞప్తుల్ని కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. రాత్రి విధుల కేటాయింపులో రొటేషన్ పద్ధతిని పక్కాగా అమల్లోకి తెస్తామన్నారు.

ఏ ఒక్కరిపైనే భారం పడకుండా అందరికీ 12 గంటల నైట్ డ్యూటీ పద్ధతి వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రేడియాలజీ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది లీవుల అంశంపై తగిన ఆదేశాలు ఇస్తామన్నారు. ఏజెన్సీ/గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలను నిబంధనల ప్రకారం కాపాడతామని తెలిపారు. ఏలూరు జిల్లాతో పాటు వివిధ జిల్లాల్లో నిధి పోర్టల్ లో ఉద్యోగుల వివరాల నమోదును వెంటనే పూర్తి చేస్తామని చెప్పారు.

**ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయం ప్రభుత్వానిదే..**

ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశం తమ పరిధిలో లేదని, ప్రభుత్వపరంగా దీనిపై నిర్ణయం జరగాల్సి ఉందని కార్యదర్శి వీరపాండియన్ చెప్పారు. అలాగే 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలంటే ప్రభుత్వంపై ఏడాదికి రూ. 331 కోట్లు అదనంగా భారం పడుతుందని చెప్పారు. రోగులకు వైద్య సేవల్లో లోపం తలెత్తకూడదని, ఆందోళనను కనీసం నెల రోజుల పాటు వాయిదా వేయాలని, ఈలోగా చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు జెఏసి ప్రతినిధులను కోరారు.

**పీహెచ్‌సీల్లో విద్యార్థులకు శిక్షణపై జేఏసీ చేసిన విజ్ఞప్తి మేరకు ఉత్తర్వుల జారీ :** డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) విద్యార్థులు తమ 6/12 నెలల క్లినికల్ శిక్షణలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలపాటు వైద్య శిక్షణ పొందాలని వైద్య విద్యాశాఖ ఆదేశించింది. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారుల ద్వారా విద్యార్థులకు శిక్షణ కేంద్రాలను కేటాయించనున్నారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, విద్యార్థి చదువుతున్న సంస్థ సూపరింటెండెంట్ శిక్షణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలి.

ఈ ధ్రువీకరణ పత్రాన్ని నమోదు సమయంలో లేదా కోర్సు ధ్రువీకరణ పత్రం జారీ చేసే సమయంలో తప్పనిసరిగా సమర్పించాలి. ధ్రువీకరణ పత్రం సమర్పించిన తర్వాతే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనుబంధ ఆరోగ్య వృత్తి నిపుణుల మండలి ద్వారా కోర్సు ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని ఉత్తర్వుల్లో డిఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

# నేరాల కట్టడికి పటిష్ట నిఘా.. ప్రజలకు సత్వర న్యాయం

## - ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కమిషనర్ గౌష్ ఆలం వార్షిక తనిఖీ

**కరీంనగర్ ప్రతినిధి, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు పోలీస్ సిబ్బంది వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించిన ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని జనరల్ డైరీ (జీడీ), ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లు, రిసెప్షన్ నిర్వహణ తదితర రికార్డులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. లాకప్ గదులు, ఆయుధాగారం, భద్రతా విభాగాలను తనిఖీ చేశారు. గ్రామాల వారీగా హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలు, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. రాత్రి గస్తీ, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ల గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, తద్వారా ప్రజల్లో పోలీసు వ్యవస్థపై మరింత విశ్వాసం పెంపొందించాలని సూచించారు.



పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, సాంకేతిక ఆధారాల ను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. నాణ్యమైన దర్యాప్తు అనంతరం కోర్టుల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా పటిష్ట చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రధాన కూడళ్లు, గ్రామాలు, కాలనీలలో 'నేను సైతం' కార్యక్రమం కింద సీసీ కెమెరాల ఏర్పాటు సంఖ్యను పెంచేందుకు ప్రజలకు అవగా హన కల్పించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ఈ వార్షిక తనిఖీలో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, తిమ్మాపూర్ సీఐ బొల్లం రమేష్, ఎల్ఎండీ ఎస్ఐ అన్వర్ పాషా, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి నెల మూడు మెడికల్‌బోర్డులు నిర్వహించాలి : కాపు కృష్ణ

**కొత్తగూడెంసింగరేణి సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణిలో ప్రతి నెలాక్రమం తప్పకుండా 3మెడికల్ బోర్డులు నిర్వహించి,అనారోగ్యంతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరిని, వందశాతం అనిఫిట్ చేయాలని తెలంగాణ బొగ్గు గనికార్మిక సంఘంముఖ్య ప్రధాన కార్యదర్శి కాపుకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏరియాలోని ఉద్యోగు లందరూ వైస్‌ప్రెసిడెంట్ గడప రాజయ్య ఆధ్వర్యంలో మంగళ వారం నల్లబ్యాడ్జీలుధరించి నిరసన తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో 1998లో రద్దు చేసిన డిపెండెంట్ ఉద్యోగాల స్థానంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కెసిఆర్‌కారుణ్య నియామకాలు ప్రవేశపెట్టారని, తద్వారా 14వేల పైచిలుకు కార్మికులను మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ చేయడం, తద్వారా ఉద్యోగం కోరుకున్న వేలాది కార్మిక కుటుంబాలకు న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ, ఏఐటీయుసి, ఐఎన్టీయుసి సంఘాలు



కార్మికుల ఎదుట మొసలి కన్నీళ్లు కార్చుకుంటూ ఎన్నికల్లో మేముగెలిస్తే దరఖాస్తు చేసుకున్న కార్మికులకు నూటికి నూరు శాతం మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తామని, ప్రతి నెల కనీసం మూడుమెడికల్ బోర్డులు నిర్వహిస్తామని హామీల వరద సృష్టించారని, ఆచరణలో మాత్రం దాదాపు 15నెలలో బోర్డు నిర్వహించ లేదన్నారు. ఇప్పటికైనా దరఖాస్తు చేసి మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తున్న కార్మికుల కుటుంబాల భవిష్యత్తు దృష్ట్యా నిరంతరాయంగా మెడికల్ బోర్డు నిర్వహించి రోగాలతో బాధపడుతున్న వారందరినీ మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం మైన్ మేనేజర్లకు డిపార్టుమెంట్ హెచ్ఓడికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, రవికుమార్, సంతోష్, నిశాంత్, వెంకటేశ్వర్లు, అలీమ్‌పాషా, వినీత్, అజీజ్, బాలాజీ, అన్వర్‌పాషా, నవీన్, శంకర్, వెంకట్రావు, అనుదీప్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయాలి



**కోహెడ, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఏబీవీపీ ఆధ్వర్యంలో.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ హుస్నాబాద్‌లోని ఆర్డీవోకి వినతి పత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.11,000 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయని జిల్లా హాస్టళ్ల కన్వీనర్ చెన్నూరి రాజేష్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# గోడి గుడ్ల సరఫరాకు టెండర్ల ఆహ్వానం : పిఓ



**భద్రాచలం సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** 2026-27విద్యా సంవత్సరంకు గాను భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోగల గిరిజన సంక్షేమ శాఖపరిధిలోఉన్నటువంటి గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన వసతి గృహాలు, పోస్ట్‌మెట్రిక్ కాలేజీ హాస్టల్‌లు అవసరమైన గుడ్లు సరఫరా చేయడానికిఆసక్తిగల అమ్మకం దారుల నుండి సీల్ట్‌టెండర్లు కోరుతున్నట్లు ఐటిడిఏ పిఓ బి.రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు టెండర్ ఫారం రూ.2వేలు, డిమాండ్‌డ్రాఫ్ట్ ఉపసంచాలకులు (గి.సం)శాఖ ఐటిడిఏ భద్రాచలం వారం పేరున ఎస్బిఐ భద్రాచలం నందు చెల్లుబాటు అయ్యే విధంగా సమర్పించి ఈనెల 2నుండి 9లోపు ఉపసంచాలకులు భద్రాచలం కార్యాలయం నుంచి టెండర్ ఫారం పొందవచ్చని తెలిపారు. ధారవత్ సొమ్ము గుడ్లు రూ.50,000 డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో టెండర్ ఫారంతో పాటుగా టెండర్ బాక్సనందు సమర్పించాలని తెలిపారు. ఈనెల 10న ఉదయం 11గంటలకు సీల్డ్‌టెండర్ తెరచి పిఓ తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని డిడిట్రైబల్‌వెల్ఫేర్ అధికారిని చందన తెలిపారు.

### బీజేపీ కార్యాలయంపై

# కాంగ్రెస్ గుండా రాజకీయాలకు పరాకాష్ట

- ఇదేనా కాంగ్రెస్ వీరత్వం
- పోలీసులు వేసుకున్నది ఖాకీ బట్టలా? కాంగ్రెస్ బట్టలా
- రామచంద్రరావును హౌస్ అరెస్టు చేయడం రేవంత్‌రెడ్డి పిరికితనానికి నిదర్శనం
- బీజేపీ కార్యకర్తల ఓపికను పరీక్షించొద్దు : దేవకీ వాసుదేవరావు



**ఖమ్మం సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ కార్యాలయంపై తెలంగాణరాష్ట్ర కార్యాలయాన్ని యూత్ కాంగ్రెస్ గూండాలు ముట్టడించిదాడికి పాల్పడటాన్ని బీజెపి రాష్ట్రకోశాధికారి దేవకీ వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బీజెపికార్యాలయంలో ఎవరూ లేనిసమయంలో పరికిపందల్లాగా వచ్చి దాడి చేయడం సిగ్గుచేటని, అమానుషమన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక ఇలా దాడులకు పాల్పడటం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటికీ తన పెయింటింగ్ వ్యాపారం బుద్ధి పోనిచ్చుకోలేదా అనిప్రశ్నించారు. పోలీస్ శాఖ వైకరిపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరుకాకీబట్టలు వేసుకున్నారా లేక కాంగ్రెస్ బట్టలు వేసుకున్నారో ఒక్కసారి ఆలోచించుకోండి, కాంగ్రెస్‌పార్టీకి తొత్తులుగా, చెంచాగిరి చేయడం యావత్ పోలీస్‌శాఖకే మచ్చ తెచ్చే విధంగా ఉందని ఆయన విమర్శించారు. దేశప్రధానిమోదీ దిష్టిబమ్మను దహనం చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటతోపాటు బాధ్యతరాహిత్యమన్నారు. బీజెపి కార్యకర్తలసహనాన్ని పరీక్షించవద్దని కాంగ్రెస్ కార్యకర్తల్లాగా మా కార్యకర్తలు బీరు,బిర్యానీ బ్యాచ్ కాదు బిడ్డా అని, వారిసహనాన్ని ఓపికను పరీక్షించ వద్దని హెచ్చరించారు. బీజపిఎలాంటి కార్యక్రమానికి పిలుపునివ్వకముందే ముందస్తు అరెస్టులు చేయ డం ప్రభుత్వ పిరికతనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తెలుసుకోండి మేము రాజ్యాంగంపైన, చట్టంపైన గౌరవం ఉన్న వాళ్లమని, శాంతిభద్రతలకుభంగం కలగకూడదనిచాలా ఓపిక పడుతున్నామని, మా ఓపికను పరీక్షిస్తే రెట్టింపు కార్యక్రమాలకు శ్రీకారంచుడతామని హెచ్చరించారు.

# జీఓ 76ను వెంటనే అమలు చేయాలి

## - బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



**కొత్తగూడెం సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** జిఓ 76ను వెంటనే అమలు చేసి, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజెపి పట్టణ అధ్యక్షులు శీలంవిద్యాసాగర్ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ వద్ద మంగళవారం ఒక్కరోజు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇప్పటికైనా స్పందించాలని హితవు పలికారు. ప్రజల సమస్యలను పట్టించు కోకుండా మొద్దునిద్రలో ఉన్న ఎమ్మెల్యే వెంటనే మేల్కొని, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ముందుగా నియోజకవర్గంలోని ప్రజాసమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషిచేసిన అనంతరం ఢిల్లీలో బీజపిపై పోరాటాలుచేయాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన జిఓ 76ను వెంటనే అమలు చేయాలని, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాములునాయక్, ఆకుల నాగేశ్వరరావుగౌడ్, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, రమేష్,రాయుడు, నాగేశ్వరరావు, ఆదిమూల రాములు, కనుకుంట్ల రజమౌళి, రాజేష్, క్రాంతి, సంపత్, నర్సింహారావు, గాంధీ, శ్రీనివాస్, పూర్ణ, అలివేలు, యామిని, హాసిని, రమేష్, రాజశేఖర్, శ్రీనివాస్, భాస్కర్‌గౌడ్, రవి, గిరి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి

## - ఉద్యోగుల పెన్షన్ భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి



**కొత్తగూడెం సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** సిపిఎస్‌నురద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని టీజీఈ జేసి జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. పెన్షన్ విద్రోహ దినంసందర్భంగాఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టిజిఇ జెఎసి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఐడిఓసి కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూ.. పెన్షన్ అనేది ఉద్యోగికిఇచ్చే వరంకాదని, ప్రభుత్వ సేవలో జీవితాంతం పనిచేసిన ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం గౌరవ ప్రదమైన జీవితం కోసం అవసరమైన సామాజిక భద్రత, హక్కు అని అన్నారు. సిపిఎస్ విధానంలో ఆధారపడటంతో ఉద్యోగుల భవిష్యత్తులో అనిశ్చితి ఏర్పడుతుందని అందువల్ల సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసి నాయకులు వెంకటేశ్వరరావు, వేస్లీ, లాల్ మహమ్మద్, శ్రీనివాసరెడ్డి, హరిలాల్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాసరెడ్డి, దినేష్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్‌ను రద్దు చేసిఓపిఎస్‌ను అమలుచేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.పిఆర్‌సి అమలు, పెండింగ్ డిఏల విడుదల, ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య పథకం అమలు వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, దస్రు, రాణి, రమేష్, కామేశ్వరరావు, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మీ, శ్రీనివాసరావు, గెజిటేడ్‌అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందించిన పోలీసులు

**కొత్తపల్లి సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన కొల్లూరి అంజయ్య గత సంవత్సరం కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామం వద్ద ఐక్యు కంపెనీకి చెందిన సెల్ ఫోన్ పోగొట్టుకొనగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినాడు పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను ట్రేస్ చేసి పెద్దపల్లిలో పట్టుకోవడం జరిగింది.అట్టి ఫోను యజమాని అయిన కొల్లూరి అంజయ్య కు ఇన్స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి అందజేశారు సెల్ ఫోన్ ను ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం కానిస్టేబుల్ చిట్యాల రాంసాయి ఫైజాన్ లను సిఐ ఏ. నిరంజన్ రెడ్డి అభినందించారు.

# క్రమశిక్షణే విజయానికి తొలి మెట్టు

**కరీంనగర్ ప్రతినిధి, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకులు, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్, కాలమిస్ట్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు.

కరీంనగర్‌లోని బ్లూ బెల్స్ హైస్కూల్ ఆవరణలో లీడ్ ఇండియా, శాతవాహన లయన్స్ క్లబ్బుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. సమయపాలనతో నిరంతరం కృషి చేసే విద్యార్థులు తమ లక్ష్యాలను సులభంగా సాధించగలరని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 3 నుంచి 4 గంటల పాటు చదవడం అలవాటుగా చేసుకోవాలని, చిన్ననాటి నుంచే ఏర్పరుచుకున్న మంచి అలవాట్లు జీవితాంతం ఉన్నతంగా ఎదగడానికి దోహదపడతాయని అన్నారు. పుస్తకాలు జీవితంలో అత్యంత ఆత్మీయ నేస్తాలని పేర్కొంటూ.. అవి కేవలం హస్తభూషణాలు మాత్రమే కాదని, మస్తిష్క వికాసానికి నేస్తాలని అభివర్ణించారు.

విద్యార్థులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఇష్టంతో, కష్టపడి చదివి కలెక్టర్, డాక్టర్, ఇంజనీర్, పోలీస్, న్యాయవాది, ఉపాధ్యాయుడు, ఔత్సాహిక వ్యాపారవేత్త వంటి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. బలమైన కోరికతో పాటు నిరంతర శ్రమ, పట్టుదల, క్రమ శిక్షణ ఉంటే లక్ష్య సాధన



అసాధ్యం కాదని చెప్పారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లూ బెల్స్ హైస్కూల్ చైర్మన్, ప్రిన్సిపాల్ జంగ సునీత మనోహర్ రెడ్డితో పాటు సుమారు 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

# చీడపీడల నివారణపై రైతులకు అవగాహన

**ఓదెల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** వానకాలం పంటల్లో చీడ పీడల నివారణ, సమీకృత వ్యవసాయం, నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఓదెల మండలం పోత్కపల్లి రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్‌పీఎల్ శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు.



కునారం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ చంద్ర వరి, పత్తి, మొక్కజొన్న పంటల్లో ఎరువుల వినియోగం, కలుపు యాజమాన్యం, పంట మార్పిడి ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ విజ్ఞాన కేంద్రం పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సంపత్ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ, ఆరుతడి పంటల ప్రయోజనాలపై వివరించారు. ప్రస్తుతం వరి పంటలో మోగి పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరాకు 400 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 600 మి.లీ. లేదా ఐసోసైక్లోసెరామ్ 128 మి.లీ.లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ లీటరు నీటికి 0.4 గ్రాములు లేదా స్పైనెటోరం 0.5 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పత్తిలో పచ్చదోమ నివారణకు ఫ్లానికామిడ్ లీటరు నీటికి 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్, సర్పంచ్ అంబాల సారమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సుమన్‌రెడ్డి, ఏఈవోలు మౌనిక, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రత్యంగిరా అమ్మవారికి లక్ష పుష్పార్చన

## - కరీంనగర్ విద్యానగర్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహణ



**కరీంనగర్ ప్రతినిధి, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలోని విద్యానగర్‌లో బగళ ప్రత్యంగిరా అనుగ్రహ పీఠంలో శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా ప్రత్యంగిరా అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గురూజీ దహగం శశికాంత్ శర్మ సత్యానందనాథ దీక్షానామాంకితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం, పుష్పార్చనలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పీఠానికి తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పీఠం భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు ప్రత్యంగిరా అమ్మవారి అనుగ్రహం పొందారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పీఠం నిర్వాహకులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# కార్యకర్తలే కాంగ్రెస్ బలం

## - యాకూబ్‌ను పరామర్శించిన నాగాసీతారాములు

**కొత్తగూడెం సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** కార్యకర్తలే కాంగ్రెస్‌పార్టీకి బలమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హమాలీకాలనీకిచెందిన కాంగ్రెస్ కార్యకర్త యాకూబ్‌కు ఇటీవల యాక్సిడెంట్‌కు గురై కాలికి



తీవ్ర గాయం కావడంతో ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న నాగా సీతారాములు వెంటనే వారి నివాసానికి వెళ్లి మంగళవారం పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పోరేటర్ దంతెబోయిననరేష్, ఉపసర్పంచ్ ఉబ్బన రాజు, కడియాల సత్యనారాయణ, వీరన్న, సమ్మన్న, రావుమధు, టబ్బాలవెంకట్‌యాదవ్, ఉదయ్ కుమార్‌యాదవ్, వంశీ, వినయ్ పాల్గొన్నారు.

# నిర్మాణపనుల్లో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

## - నూతన జిల్లా పోలీస్‌కార్యాలయం రోడ్డు పనులు పరిశీలించిన ఎస్పీ



**భద్రాద్రికొత్తగూడెం సెప్టెంబరు 02(జర్నలిస్ట్ ఫైల్):** రోడ్డునిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లాఎస్పీ రోహిత్ రాజు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతనపోలీస్‌కార్యాలయ సముదాయానికి నిర్మిస్తున్న రోడ్డు మార్గం పనులను ఎస్పీ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి నిర్మాణపనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి రోడ్డు నిర్మాణ ప్రగతిని, మార్గం రూపకల్పనను పరిశీలించారు. నిర్దేశిత కాలపరిమితిలో పనులను పూర్తిచేసి నూతన జిల్లా పోలీస్‌కార్యాలయానికి రాకపోకలు సులభతరం అయ్యేలాచర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేయాలని, భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను పక్కాగా చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ ఐ కృష్ణారావు, ఎస్ఐలు రమణారెడ్డి, సాయి కిషోర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ కోచింగ్ ఆరువారాల శిక్షణపూర్తి

## - రియాజ్ పాషాకు సర్టిఫికెట్ అందచేసిన పరంధామరెడ్డి



**కొత్తగూడెం సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తగూడెం రామవరంప్రాంతానికి చెందిన అథ్లెటిక్స్‌కోచ్ ఎస్‌కె.రియాజ్‌పాషా భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలోని పాటియాలా నేతాజీ సుభాష్‌జాతీయ క్రీడా సంస్థలో నిర్వహించిన ఆరు వారాల క్రీడా శిక్షణను పూర్తి చేసుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి రియాజ్‌పాషాకు సర్టిఫికెట్ అందచేసి అభినందించారు. జాతీయ స్థాయిలో పొందిన శిక్షణను ఉపయోగించుకొని స్థానిక అథ్లెటిక్స్ క్రీడాకారులకుమెరుగైన శిక్షణఅందించాలని ఆయన ఆకాంక్షించారు. పాషా కోర్సుపూర్తి చేయడం పట్ల అంతర్జాతీయ అథ్లెటిక్స్‌కోచ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరిరమేష్, అసోసియేషన్ ప్రతినిధి మహిధర్, జాతీయ క్రీడాకారుడు బాబ్జి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్‌లు మల్లిఖార్జున్‌రావు, సుష్మాబాయి తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి

**ఓదెల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఓదెలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. మహిళలకు రూ.2,500, పింఛన్ల పెంపు, రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీలు తదితర హామీలను నెరవేర్చాలని కోరారు. హామీలు అమలు చేయకపోతే ప్రజల పక్షాన పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పోలోజు రమేష్, రౌతు జలపతి, గుండేటి మధు, శ్రీనివాస్, తీర్థల కుమార్, బోడకుంట నరేష్, చింతం మొగిలి, రాసాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఓబీలకు స్థల పరిశీలన

**ఓదెల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓదెల, కొలనూరు గ్రామాల వద్ద ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. అలైన్‌మెంట్ ప్రకారం పెగ్ మార్కింగ్ చేసి, భూసేకరణకు అవసరమైన భూములను కొలిచారు.రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సమ్రాట్ రాయ్, భూసేకరణ నిపుణులు పి.దేవరాజు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, గ్రామ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# పేదల సామాజిక గౌరవానికి ప్రతీక నూతన "స్మార్ట్ రేషన్ కార్డు"

- పేదల ఆర్థిక భారాన్ని తగ్గించడమే ప్రజాప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క!



**ఏటూరు నాగారం, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** పేదల సామాజిక గౌరవానికి నూతన రేషన్ కార్డు ప్రతీకగా నిలుస్తుందని, సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

మంగళవారం ములుగు ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ములుగు, మల్లంపల్లి మండలాల లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన నూతన 'స్మార్ట్ రేషన్ కార్డుల"ను పంపిణీ చేశారు. ములుగు మండలానికి 1,809, మల్లంపల్లి మండలానికి 621 చొప్పున మొత్తం 2,430 నూతన రేషన్ కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, రేషన్ కార్డులు లేని కారణంగా అర్హులైన పేదలు సన్నబియ్యం పథకానికి దూరం కావద్దనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం నూతన కార్డులను మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ సంవత్సరంలో 12,802 నూతన రేషన్ కార్డుల ద్వారా 36,405 మంది కుటుంబ సభ్యులకు సన్నబియ్యం పథకం ప్రయోజనాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 15 లక్షలకు పైగా నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు వివరించారు.

మార్కెట్‌లో సన్నబియ్యం కొనుగోలు చేయడం పేద కుటుంబాలకు భారంగా మారిందని, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడంతో ఆ కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతోందని అన్నారు.

గతంలో పెద్ద పరిమాణంలో ఉండే రేషన్ కార్డులను తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం జేబులో సులభంగా తీసుకెళ్లగలిగేలా స్మార్ట్ కార్డులను రూపొందించి అందిస్తున్నామని తెలిపారు. రేషన్ సరుకులు పొందడానికే కాకుండా వివిధ ధ్రువపత్రాల జారీ, ఆరోగ్యశ్రీ తదితర అవసరాలకు కూడా రేషన్ కార్డు ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన పేదలకు ప్రాధాన్యమిస్తూ నూతన కార్డులను అందిస్తున్నామని, ఇంకా కార్డులు అందని అర్హులకు రానున్న రోజుల్లో అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మారుమూల ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పింఛన్ల దరఖాస్తుల గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 4 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తిస్తామని తెలిపారు.

అర్హులైన వారు తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు లేదా మీ సేవా కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అర్హులకు దరఖాస్తు ప్రక్రియలో సహకరించాలని కోరారు. ములుగు నియోజకవర్గానికి ఇప్పటివరకు 5 వేలకు పైగా ఇండ్లను లబ్ధిదారులకు అందించామని, ఇంకా అనేక పేద కుటుంబాలకు ఇండ్ల అవసరం ఉందని తెలిపారు. సర్వేలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలు ములుగులో అధికంగా ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. రెండో విడతలో అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గుడిసెల్లో నివసించే అర్హులైన కుటుంబాల వివరాలతో జాబితాలను ఖరారు చేసి పంపించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు సిమెంట్ ధరల నియంత్రణపై ప్రభుత్వం పలు సిమెంట్ కంపెనీలతో చర్చలు జరుపుతోందని తెలిపారు.

సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల ద్వారా పేదలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, డీసీఎస్ఓ ఫైజల్ హుస్సేని, డీఎం కృష్ణవేణి, తహసీల్దార్లు, నూతన రేషన్ కార్డుల లబ్ధిదారులు, రేషన్ డీలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 33 నెలల అరాచక, అసమర్థ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**ఏటూరు నాగారం, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు గడుస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు, 14 డిక్లరేషన్లను విస్మరించి ప్రజలను ఘోరంగా మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా నేతలు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు, నియోజక వర్గం ఇంచార్జ్ బడే నాగజ్యోతి, భూక్యా జంపన్న ధ్వజమెత్తారు. పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, హరీష్ రావుల పిలుపు మేరకు కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగడుతూ ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మశీగళవారం ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

**ఆడబిడ్డలకు రూ. 660 కోట్లు బాకీ:**

మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఇస్తామని చెప్పి ములుగులోని 80 వేల మంది మహిళలకు రూ. 660 కోట్లు బాకీ పడ్డారు. తులం బంగారం హామీని నీరుగార్చారు. ఉచిత బస్సు పేరుతో వరంగల్, ములుగు, ఏటూరునాగారం, భద్రాచలం రూట్లలో బస్సులు తగ్గించి చార్జీలు పెంచి ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారనీ,రైతాంగానికి పంగనామా: కేసీఆర్ హయాంలో రైతుబంధు సకాలంలో పడేది.



కాంగ్రెస్ ఎకరాకు రూ. 15,000 ఇస్తామని ఎగ్గొట్టింది. రైతు భరోసా, రుణమాఫీ, కౌలు రైతులకు రూ. 12,000 హామీలు నెరవేర్చలేదనీ అన్ని వడ్లకు బోనస్ అని చెప్పి సన్న వడ్లు 5 రకాల కే రూ. 500 బోనస్ అని చెప్పి రైతులకు తీరని ద్రోహం చేశారనీ,

**ఏజెన్సీ పోడు భూముల సమస్యలు:** కేసీఆర్ పోడు భూములకు పట్టాలిచ్చి రైతులను రాజులను చేస్తే, కాంగ్రెస్ వచ్చాక తాడువాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, స్థానిక మంత్రి సీతక్క దీనిపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు.

ధ్వంసం: 24 గంటల నాణ్యమైన కరెంట్ పోయి మోటర్లు కాలిపోయే పరిస్థితి వచ్చింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అని షాకింగ్ బిల్లులు ఇస్తున్నారు. రూ. 5 లక్షల విద్యా భరోసా, అమ్మాయిలకు స్కూటీలు, 2 లక్షల ఉద్యోగాల హామీలన్నీ అబద్ధాలని తేలిపోయాయనీ,

**ములుగు స్థానిక సమస్యలపై నిర్లక్ష్యం:**

ములుగు ఏరియా ఆసుపత్రి, ఏటూరునాగారంలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, బస్ డిపో, కరకట్ట నిర్మాణం, దేవాదుల పంప్ హౌస్ ద్వారా చెరువులు నింపే ప్రక్రియను స్థానిక మంత్రి సీతక్క పూర్తిగా విస్మరించారనీ, కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు, హైడ్రా విధ్వంసాలు, భూదందాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని, రాబోయే రోజుల్లో కేటీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పోరిక గోవింద నాయక్, తుమ్మ మల్లారెడ్డి,తాటి కృష్ణ, భూక్యా జంపన్న, మాజీ ఎంపీపీ వినయ్ కుమార్, మల్కా రమేష్, తాడూరి రఘు, దయ్య అశోక్, రమేష్ రెడ్డి, లింగాల రమణారెడ్డి, నరసింహ నాయక్, చేన్న విజయ్, ఎండి ఖాజా పాషా,పాలెం శ్రీనివాస్, చిన్ని కృష్ణ, కోయిల మహేష్, బాడిశే నాగ రమేష్, చిట్టి మల్ల సమ్మయ్య, భూక్యా అమర్ సింగ్, ముడ తన పెల్లి మోహన్, ముంజల బిక్షపతి, పోరిక విజయ్, బైక్ అని ఓదేలు, కోళ్ల వెంకన్న, కర్ర రవీందర్, వేణుగోపాల్, కుమ్మరి చంద్ర బాబు, జాడి బోజరావు, మరియు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, వివిధ మండ లాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

- విధులకు హాజరుకాని వైద్య సిబ్బందికి షోకాజు నోటీసులు
- ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం కావాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం వడ్డేపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. వడ్డేపల్లి మండల కేజీబీవీ సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతిని తెలుసుకొని, ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కుల గురించి అడిగారు. విద్యార్థులకు ఏక రూప దుస్తులతో పాటు రాత, పాఠ్య పుస్తకాల పంపిణీ గురించి మాట్లాడారు. అలాగే సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. వంటశాలను సందర్శించి అక్కడ వండుతున్న పదార్థాలను పరిశీలించారు. స్టోర్ గదిలో సరకుల నిలువలపై ఆరా తీశారు. వాష్ రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పర్యావరణ హితంగా క్రాఫ్ట్ వస్తువులతో విద్యార్థినిలు తయారుచేసిన రాఖీని కలెక్టర్ కు కట్టారు. ఈ సందర్భంగా శాంతినగర్ లోని పదవ వార్డు పోలింగ్ స్టేషన్ 174లో



జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్ల అందరికీ నోటీసులు అందజేసి, నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. అనంతరం వడ్డేపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేసి చాలామంది గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు సిబ్బందికి షోకాజు నోటీసులు ఇవ్వాలని డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయితో చరవాణిలో మాట్లాడి ఆదేశించారు. ఆసుపత్రి శుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో వడ్డేపల్లి తహసిల్దార్



శివకుమార్, ఉపతహసిల్దార్ వేణుగోపాల్ రెడ్డి, కస్తూర్బా ప్రత్యేక అధికారిని పద్మావతి, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

ఎరువుల బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కలిగించాలి యూరియా, డిఏపి, కాంప్లెక్స్, ఇతర ఎలాంటి ఎరువులు కొనుగోలు చేయాలన్న ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ ఆప్ ను వినియోగించడంపై రైతులకు అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం సాయంత్రం శాంతినగర్ లోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. యాప్ వినియోగంపై ప్రతి దుకాణం వద్ద బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రకాల విత్తనాలు, ఎరువుల అమ్మకాల గురించి యజమానులతో మాట్లాడారు. ఈ పర్యటనలో ఏడిఏ శివనాగిరెడ్డి, ఎంఏఓ రాధ, ఏఈఓ లు విమల, వినోద్ కుమార్, తదితరులున్నారు.

## నిరుపేదలందరికి ఉచిత న్యాయ సహాయం

### - జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ ఇందిర



**అడ్డాకుల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** నిరుపేదలందరికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ ఇందిర అన్నారు. మంగళవారం అడ్డాకుల మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. 3 లక్షల ఆదాయం లోపల ఉన్న వారికి ఉచిత న్యాయం అందిస్తామన్నారు. కోర్టు దగ్గరికి రానివారు ,15100.. టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను చెప్పవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దానికి ఒక చట్టం ఉందని, ప్రతిదీ చివరికి రాజి పడాల్సిందేనని వివరించారు. రైతులకు అగ్రి లీగల్ చట్టం ఉందని, తల్లి, తండ్రుల ఆస్తి పిల్లలకు రావాలంటే ముటేషన్ చేసుకోవాలని .వేరే వారితో ఆస్తి కొంటె రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం చేసుకోవాలని, సాదా కాగితాలపై రాసుకోకుండా ఉండాలని సూచించారు. విత్తనాల చట్టం ప్రకారం నకిలీ విత్తనం అమ్మితే అగ్రికల్చర్ అధికారికి చెప్పాలని, మార్కెట్ చట్టం, ప్రకారం కొనుగోలు అమ్మకాల గురించి ఏవైనా సమస్యలు ఉంటే చిట్టెం ఇవ్వ ప్రకారం పరిష్కరించుకోవాలని, వాల్టా యాక్ట్ ప్రకారం బోర్ వేయాలంటే రెవిన్యూ అధికారులతో పాటు గ్రామపంచాయతీ విద్యుత్ అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీమా చట్టం ప్రకారం రైతు బీమా, సాదా కాగితాలు వ్రాసుకోకిండా కుటుంబ సభ్యులు బాగ పరిస్కారం చేసుకోవాలని, ప్రామీసారి నోట్ వ్రాసుకునేటప్పుడు డబ్బులు అంకెలతో పాటు అక్షరాలా అని వ్రాయాలని వివరించారు. చైల్డ్ లేబర్.. చైల్డ్ మ్యారేజ్ వంటి వాటిని అరికట్టాలని, 18 యేండ్లు నిండని అమ్మాయిని బలవంతంగా పెళ్లి చేసుకున్న, మోసం చేసి గర్భవతిని చేసిన, ఫోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శేఖర్, వ్యవసాయ అధికారి, అడ్డాకుల ఎస్సై మురళి, సర్పంచ్ దశరథరెడ్డి, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు, రవాణా.. ముగ్గురు అరెస్ట్

### - 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, వాహనం స్వాధీనం




**మిర్యాలగూడ సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి, రవాణా చేస్తూ నిల్వ చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేశవనగర్, వెంకటాద్రిపాలెం గ్రామంలోని శ్రీ మారుతీ ట్రేడర్స్ శ్రీరామ బిన్నీ రైస్ మిల్ వద్ద పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో సెప్టెంబర్ 1న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రైస్ మిల్ వద్ద కుంచకూరి వెంకటేశ్వర్లు, మేళ్లచెరువు వెంకటరమణ, షేక్ మదార్‌లు ఉండగా, అక్కడి అశోక్ లేలాండ్ మినీ వాహనం (టీఎస్ 07 యూఎల్ 3085)లో సుమారు 36 బస్తాల్లో 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పంచుల సమక్షంలో పీడీఎస్ బియ్యంతో పాటు వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో కుంచకూరి వెంకటేశ్వర్లు చుట్టుపక్కల గ్రామాల్లోని తెల్ల రేషన్ కార్డుదారుల వద్ద నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లుకు తరలించి, పాలిష్ చేయించి ఇతర బస్తాల్లో ప్యాకింగ్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తూ అక్రమ లాభం పొందుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మేళ్లచెరువు వెంకటరమణ గుమాస్తాగా పీడీఎస్ బియ్యం సేకరణ, రవాణాలో సహకరిస్తుండగా, షేక్ మదార్ డ్రైవర్‌గా వాహనం ద్వారా బియ్యాన్ని రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దర్యాప్తులో భాగంగా నిందితులు ఏ-02, ఏ-03 వద్ద ఉన్న మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా దుర్వినియోగం చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ రూరల్ పోలీసులు హెచ్చరించారు.

## జాతీయ రహదారి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



**దేవరకద్ర, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి వెంట చేపడుతున్న పరిశుభ్రత పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం పరిశీలించారు. జాతీయ రహదారి వెంట కొనసాగుతున్న శుభ్రత పనులతో పాటు రహదారి మధ్య మీడియన్‌లో మొక్కల పెంపకం, బారికేడింగ్, గడ్డి, పిచ్చిమొక్కల తొలగింపు, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిని సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారి పరిసరాలు పరిశుభ్రంగా, సుందరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి వెంట గుర్తించిన శుభ్రత పనులు, మొక్కలు నాటడం, బారికేడింగ్, గడ్డి తొలగింపు తదితర అన్ని పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

## కాల్వల నిర్మాణాలు పూర్తి చేసి.. గొలుసు కట్టు ద్వారా రైతులకు సాగునీరు అందిస్తాం

### - జీఎమ్ఆర్ దేవరకద్ర శాసన సభ్యులు



**దేవరకద్ర, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి కేఎల్ఐ ద్వారా అడ్డాకుల,మూసాపేట మండలాలకు సాగునీరు అందించి కాలువల పనులను పరిశీలించారు. డి12,డి13,డి8 కాలువల పనులు నిలిచిపోవడంతోనే దేవరకద్ర నియోజకవర్గం లోని 7 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని గుర్తించారు. కాలువల గుండా నీరు ప్రవహిస్తే భూగర్భ జలాలు వృద్ధిచెంది బోర్లు రీఛార్జ్ అయ్యి మరో 5 వేల ఎకరాల్లో పరోక్షంగా సాగు విస్తీర్ణం అందుబాటులోకి వచ్చేదని పేర్కొన్నారు. రాం రాం పల్లి,లట్టుపల్లి గ్రామాలతో పాటు మూసాపేట మండలంలోని నిజాలాపూర్ పెద్ద చెరువు అడ్డాకుల మండలం కందూరు శివారులోని లోక సముద్రం,బైరాముని చెరువు పాటు కాలువలను పరిశీలించారు. గట్టు కాడిపల్లిలో డీ12 కాలువను రెండు కిలోమీటర్ల మేర పూర్తి చేస్తే అడ్డాకుల,మూసాపేట మండలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించొచ్చని అధికారులు ఎమ్మెల్యే జీఎమ్ఆర్ గారికి వివరించారు. మల్కాపురంలో డి.8 కాలువను పూర్తి చేయాలని కృతనిశ్చయంతో ఉన్నామని అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే జీఎమ్ఆర్ సూచించారు.గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కె.ఎల్.ఐ బ్రాంచ్ కెనాల్ ను పూర్తిగా విస్మరించారని అసెంబ్లీలో చర్చించి పూర్తి చేయిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎమ్ఆర్ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్.

### - జెడ్పి సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వసంత.



**పర్వతగిరి, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్ జిల్లా పరిషత్ సీఈఓ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వసంత మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిపాలనలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

## స్వామి వారిని దర్శించుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే..



**యాదగిరిగుట్ట, సెప్టెంబరు 2 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిదేవాలయాన్ని మంగళవారం ఉదయం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. కాగా ఆలయ ఏఈఓ సురేందర్ రెడ్డి స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధానార్చకులు మంగళగిరి నరసింహమూర్తి, వేద పండితులు శ్రీనివాస శర్మ, పాల్గొన్నారు.

## అత్యాధునిక ప్రమాణాలతో యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం

### - కౌకుంట్ల మండలంలో తెలంగాణ మాడల్ స్కూల్ ఏర్పాటు..



**దేవరకద్ర, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** చిన్నచింతకుంట మండలం ధమాగ్నాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంట°గ్రేటెడ్ పాఠశాల పనులను ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. అత్యాధునిక ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తున్నామని తెలియజేశారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో అక్కడే సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు అత్యధిక సౌకర్యాలతో విద్యార్థులకు విద్య బోధన అందించాలని లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. స్కూల్ నిర్మాణం పూర్తయి వచ్చే విద్య సంవత్సరానికి అందు బాటులోకి తీసుకువచ్చేలా ప్రయత్నిస్తున్నాం అని అన్నారు. యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుతో వెనుకబడ్డ ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కౌకుంటలో తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటు చేయునట్లు ఈ సంధర్భంగా తెలియజేశారు. అందుకు ఐదు ఎకరాల స్థలం కేటాయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు,గ్రామస్తులు,రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు

**గద్వాల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొనే క్రీడాకారుల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయి ఎంపికలు ఈ నెల 3వ తేదీన గురువారం గద్వాల్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రామలింగేశ్వర గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలోని ఆసక్తి, అర్హత కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 3వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఎంప్లాయీ ఐడీ కార్డు మరియు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయంలో హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, ప్రతిభ కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని, తద్వారా రాష్ట్ర స్థాయి ఎంపికలకు అర్హత సాధించే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన పోటీ వాతావరణాన్ని ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రోత్సహించడమే ఈ ఎంపికల ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా యువజన క్రీడల అధికారి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట

## ముఖ్య నాయకులతో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య సమావేశం

### పోరుబాట విజయవంతం చేయాలని పిలుపు



**తాండూర్, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న, కాంగ్రెస్ 420 మోసాలపై పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. తాండూర్ మండల కేంద్రంలోని ఎలుక రాంచందర్ నివాసంలో మంగళవారం ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నమ్మిన ప్రజలను నిట్టనిలువునా దగా చేసిందని ఆయన మండిపడ్డారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేలు, వికలాంగులకు నెలకు రూ.6 వేలు, ఎకరాకు రూ.15 వేల రైతుబంధు, విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, కౌలు రైతులకు రూ.12 వేలు, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు తదితర కాంగ్రెస్ 420 హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని ఆయన విమర్శించారు. యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు, అన్ని వర్గాల వారిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు, ఎన్నికల హామీల అమలులో జరుగుతున్న మోసం, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రజానీకానికి చేరవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 2నుంచి 8వరకు నియోజకవర్గంలో చేపట్టే నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈకార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 10గంటలకు బెల్లంపల్లి కాంట చౌరస్తాలో ధర్నా బాకీ కార్డులు పంచడం 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు తాళ్లపల్లి పురుషోత్తం గౌడ్, మంగపతి సురేష్ బాబు, పూసల ప్రణయ్ కుమార్, బోనగిరి చంద్రశేఖర్, మాసాడి శ్రీరాములు, గట్టు సంతోష్, బోడ సతీష్, మొగిలి శంకర్, జాడి పోశం, అర్జున్, పెరిక రాజన్న, బాబు ఖాన్, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# అప్పులు, అవినీతి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది శూన్యమన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఫైర్



**నిర్మల్, (జర్నలిస్ట్ ఫైల్) :** నిర్మల్ నియోజకవర్గం లో ఈరోజు ఇటువంటి పరిమాణాలపై తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.
వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్దాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో అప్పులు, అవినీతి పెరిగిపోయాయని ఆరోపించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, బీజేపీ యువమోర్చా ఆందోళన చేస్తుంటే భయపడి బీజేపీ కార్యాలయాలపై, నాయకుల ఇళ్లపై దాడులు చేయిస్తోందని విమర్శించారు.
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ గుండాయిజం భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంపై భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడి చేయడం కాంగ్రెస్ యొక్క సిగ్గుమాలిన చర్య పిరికిపంద చర్య గత నెల రోజులుగా భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ పై స్కాలర్షిప్లపై పోరాటం చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే విద్యాశాఖ మంత్రి అయినటువంటి రేవంత్ రెడ్డి ఎక్కడ తాను రాజీనామా చేయవలసి వస్తుందని మరియు బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అవినీతిపై అసమర్థతపై పోరాటం చేస్తుంటే చూసి భయపడినటువంటి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ తన మంత్రులు రాజీనామా చేయవలసి వస్తుందని ఈ విషయాలన్నింటినీ పక్కదారి పట్టించేందుకే భారతీయ జనతా పార్టీ కార్యాలయాలపై నాయకుల ఇళ్లపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రయత్నం చేస్తుంది మీ దాడులకు భయపడే నాయకులు కాదు భారతీయ జనతా పార్టీ నాయకులు ధర్మం దేశం కోసం అవినీతిపై ఇప్పటికే ఎన్నో పోరాటాలు చేసారు నీ తాటాకు చప్పుల్లకు ఎవరు భయపడేది లేదని వెంటనే ఇటువంటి చర్యలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించడం జరుగుతుందని నిరసనగా ఈరోజు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అసరవెల్లిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## - నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్

**నల్లబెల్లి, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
నల్లబెల్లి మండలంలోని అసరవెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం గ్రామ పార్టీ అధ్యక్షులు జలగం రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలోతు చరణ్ సింగ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అసరవెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా అజ్మీర వీరన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం మండల అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్ మాట్లాడుతూ....
గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు.పార్టీపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొడుతూ,ప్రతి కార్యకర్తకు



అండగా నిలిచి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నల్లబెల్లి మండల పిఏసిఎస్ డైరెక్టర్ చార్ల శివారెడ్డి, వంగర వెంకన్న,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాలోత్ మోహన్, కడబోయిన సధి, అజ్మీర వీరన్న, యాకయ్య, రాజు, రజనీకర్, పూర్ణచందర్ అశోక్, సాంబయ్య, హుస్సేన్, శ్రీను, రజాక్తో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ సర్పంచ్ కా శెట్టి వీరేశం



**పెగడపల్లి, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను గ్రామ సర్పంచ్ కాసెట్టి వీరేశం ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గజ్జి రమ తిరుపతి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మమత సిఏ రజిత ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ లో కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ పోరుబాటు

### పోరుబాట విజయవంతం చేయాలని పిలుపు

**నిర్మల్, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న, కాంగ్రెస్ 420 మోసాలపై పోరుబాట కార్యక్రమాన్ని నిర్మల్ కేంద్రంలోని మంగళవారం తన నివాసంలో ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నమ్మిన ప్రజలను నిట్టనిలువునా దగా చేసిందని ఆయన మండిపడ్డారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేలు, వికలాంగులకు నెలకు రూ.6 వేలు, ఎకరాకు రూ.15 వేల రైతుబంధు, విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, కౌలు రైతులు ఒక్కటి కూడా అమలు కాలేదని ఆయన విమర్శించారు. యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు, అన్ని వర్గాల వారిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు, ఎన్నికల హామీల అమలులో జరుగుతున్న మోసం, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రజానీకానికి చేరవేసేలా పార్టీ



నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 2నుంచి 8వరకు నియోజకవర్గంలో చేపట్టే నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈకార్యక్రమంలో భాగంగా రేపు మొదటిగా ఆర్డీవో ఆఫీస్ లో వినతి ఇవ్వడం జరుగుతుంది 2 రోజు రేవంత్ పాలనపై మహిళా పింఛన్ రైతు రుణమాఫీ రైతుబంధు గురించి వివరణ చేయడం జరుగుతుంది, 3మూడవరోజు రైతు సదస్సు కార్యక్రమం ఉంటుంది 4నాలుగవ రోజు రెండువేల పింఛం 4000 వరకు చేస్తామని హామీ ఇచ్చిన కే రేవంత్ ప్రభుత్వం పై తీవ్ర పరిణామం చేకూర్పోమని హామీ ఇచ్చారు,5th రోజు ఉదయం 10గంటలకు కొండాపూర్ పార్టీ ఆఫీస్ లో ధర్నా బాకీ కార్డులు పంచడం ఫ్లెక్సీ ప్రదర్శన కార్యక్రమానికి పార్టీ నాయకులు, 6 ఆరవ రోజు ట్యాంక్ బండి పై అంబేద్కర్ గారికి మెమోదరం ఇవ్వడం జరుగుతుంది 7 రోజు మండల ఆఫీసులో వినతులు, 8రోజు ముగింపు కార్యక్రమం , వినతులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో నిర్మల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాంకిషన్ రెడ్డి, సోన్ ఎక్స్ జెడ్పిటిసి జీవన్ రెడ్డి,కన్వీనర్ సాయి రెడ్డి, నిర్మల్ కన్వీనర్ మహేష్ రెడ్డి,లక్ష్మణ్ చంద్ర కన్వీనర్ కృష్ణారెడ్డి, దిలావూర్ కన్వీనర్ చిన్నారెడ్డి, సారంగాపూర్ కన్వీనర్ దేవి శంకర్ శ్యామ్ రెడ్డి , దత్తు , అన్వేష్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ఆర్జీ-1 ఏరియాలో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి

### ఆగస్టులో 124 శాతం ఉత్పత్తి.. రవాణాలో 102 శాతం లక్ష్య సాధన




**రామ్మందిర్ ఏరియా, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
గోదావరిఖని: సింగరేణి రామగుండం ఏరియా-1లో ఆగస్టు నెలలో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ-1 ఏరియా జీఎం లలిత్కుమార్ తెలిపారు. ఆర్జీ-1 పరిధిలోని బొగ్గు గనులు, ఉపరితల గనుల ప్రాజెక్టుల్లో ఆగస్టు నెలలో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఉత్పత్తి సాధించినట్లు ఆయన వెల్లడించారు.
ఆగస్టు నెలకు 2,45,200 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించగా, 3,04,086 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం తెలిపారు. దీంతో నిర్దేశిత లక్ష్యంపై 124 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించి ఉత్పత్తి సాధించినందుకు అధికారులను, కార్మికులను ఆయన అభినందించారు.
అదేవిధంగా బొగ్గు రవాణాలోనూ ఏరియా మెరుగైన పనితీరు కనబరిచిందన్నారు. 2,45,200 టన్నుల బొగ్గు రవాణా లక్ష్యానికి గాను 2,50,739 టన్నుల బొగ్గును రవాణా చేసి 102 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు.
గని వారీగా పరిశీలిస్తే జీడీకే-1, 3 బొగ్గు గనుల్లో 64 శాతం, జీడీకే-2, 2ఏ బొగ్గు గనుల్లో 71 శాతం, జీడీకే-1ఏ గనిలో 298 శాతం ఉత్పత్తి సాధించినట్లు జీఎం లలిత్కుమార్ పేర్కొన్నారు.
ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల రక్షణకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గనుల్లో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తిని కొనసాగిస్తున్నామని చెప్పారు. గనుల్లో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు తెలిపారు.
పరిశ్రమలకు అవసరమైన బొగ్గును వేగంగా రవాణా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికారులు చంద్రశేఖర్, రఏ తిరుపతి, ఆంజనేయులు, జితేందర్సింగ్, వేణు, హనుమంతరావు, వీరారెడ్డి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతిగా వెయ్యి రోజుల ప్రజాపాలన



**జగిత్యాల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన సంబరాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజంగి నందయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మిస్తూ సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు భరోసా, రూ.21 వేల కోట్ల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, విద్యార్థుల డైట్ ఛార్జీల పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, విద్యావైద్య రంగాల అభివృద్ధి వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినప్పటికీ, వాటి వడ్డీలను చెల్లిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో సీఎం రేవంత్రెడ్డి కీలక పాత్ర పోషించారని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి సారథ్యంలో జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. చంద్రబాబు, కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రులు అయినట్లే రేవంత్రెడ్డి కూడా రెండుసార్లు ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు.కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, అడువాల జ్యోతి లక్ష్మణ్, ఎన్ఆర్ఐ సెల్ చాంద్పాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మన్సూర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దుమల రాజ్కుమార్, సురేందర్ నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్లు దామోదర్రావు, నక్కల రవీందర్రెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, బాలముకుందం, సీనియర్ నాయకులు గట్టు సతీష్, తాటిపర్తి శరత్రెడ్డి, డీలర్ రవి, వివిధ విభాగాల నాయకులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ఆదుకున్న వార్డు సభ్యుడు

**జగిత్యాల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
మాతా శిశు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనోజ్ఞకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో వెంగళపూర్కు చెందిన వార్డు సభ్యుడు రాసమాల సురేష్ స్పందించి రక్తదానం చేశారు.
మంగళవారం బిసవేని నారాయణ కుమార్తె మనోజ్ఞకు శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా రక్తం అవసరమైంది. దీంతో బలబత్తుల కిషన్ సురేష్ను సంప్రదించగా వెంటనే ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు.
ఆపద సమయంలో స్పందించి రక్తదానం చేసిన రాసమాల సురేష్కు బలబత్తుల కిషన్ కృతజ్ఞతలు తెలిపారు.




# దేశానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చేలా సత్తా చాటాలి - పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి

### నేషనల్ మెరిట్ సాధించిన క్రీడాకారులకు రూ. 75 వేల నగదు పురస్కారం అందించిన షేక్షావలి రెడ్డి

**నంద్యాల, సెప్టెంబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభ చాటి దేశానికి ఖ్యాతి పెంచేలా కృషి చేయాలని జిల్లా బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి పేర్కొన్నారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి నేషనల్ లో మెరిట్ సాధించిన క్రీడాకారులను షేక్షావలి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నేషనల్ మెరిట్ సాధించ మన రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ డే సందర్భంగా ఒక్కొక్కరికి 75 వేల రూపాయలు అందించగా ఆ నగదు పురస్కారాన్ని తక్కువ చూపిన క్రీడాకారులకు షేక్షావలి రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. జాతీయస్థాయిలో మెరిట్




సాధించడం రాష్ట్రానికి గర్వకారణం అని కొనియాడారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులైన కె.కిరణ్ కుమార్, కెఎల్వి సాయి, సురేష్, మల్లికార్జున, సుభాష్, గురు తేజలను సత్కరించారు ఈ కార్యక్రమంలో బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ సభ్యులు పీవీఎస్ భరణి, చోరీ ప్రసాద్, బాబు, సురేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌కు బీజేపీ మాధవ్ జన్మదిన శుభాకాంక్షలు



- ప్రజల పక్షపాతిగా పవన్ సేవలు అభినందనీయం
- సనాతన ధర్మ పరిరక్షణలో ఆయన నిబద్ధత స్ఫూర్తిదాయకం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సామాన్యుడి పక్షాన నిలుస్తూ, సామాజిక స్పృహతో ప్రజా సమస్యలపై స్పందిస్తున్న పవన్ కళ్యాణ్ ప్రజా ప్రస్థానం అభినందనీయమని పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యతనిస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్న ఆయన నిబద్ధత ప్రజలకు, జనసేన శ్రేణులకు ధైర్యాన్నిస్తోందన్నారు.
సినీ రంగంలో తనదైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న పవన్ కళ్యాణ్.. ప్రజా జీవితంలోకి వచ్చిన అనంతరం సామాజిక అంశాలపై తనదైన గొంతుకను వినిపిస్తున్నారని పీవీఎన్ మాధవ్ తెలిపారు. ముఖ్యంగా సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులను ధైర్యంగా ప్రశ్నిస్తూ, ధర్మ పరిరక్షణ కోసం ఆయన చూపుతున్న నిబద్ధత అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిలో పవన్ కళ్యాణ్ పాత్ర కీలకమని పేర్కొన్నారు.
రాష్ట్ర ప్రగతి కోసం భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ ముందుకు సాగాలని పీవీఎన్ మాధవ్ ఆకాంక్షించారు. ప్రజా దీవెనలు, భగవంతుడి ఆశీస్సులతో పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరెన్నో విజయ శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు.

## ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి




- గుంటూరు సిటీ ఏపీ జేఏసీ డిమాండ్
- ఐదో తేదీ జేఏసీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ఉద్యోగుల పెండింగ్ బకాయిలను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని గుంటూరు సిటీ ఏపీ జేఏసీ డిమాండ్ చేసింది. గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో సిటీ జేఏసీ అధ్యక్షుడు చింతల కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఏపీ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ పిలుపు మేరకు జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలతో పాటు ఐదు డీఏలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ చైర్మన్ నియామకంపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చామని, ఈ నెల 5వ తేదీలోగా సమస్యలను పరిష్కార దిశగా తీసుకువస్తారనే నమ్మకం ఉందన్నారు. లేనిపక్షంలో అదే రోజు జరిగే రాష్ట్ర జేఏసీ సమావేశంలో తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టేందుకు వెనుకాడబోమని అన్ని భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు తీర్మానించినట్లు తెలిపారు.
సమావేశానికి ఆత్మీయ అతిథిగా హాజరైన గుంటూరు జిల్లా జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఈ నెల 5వ తేదీలోగా సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగులను కించపరిచే విధంగా జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ ఎన్జీవో గుంటూరు సిటీ కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఏపీ ఎన్జీవో ఉపాధ్యక్షుడు షేక్ నాగు షరీఫ్, గుంటూరు నగర కార్యదర్శి కోటేశ్వరరావుతో పాటు జేఏసీలోని అన్ని భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు, గుంటూరు జిల్లా, నగర శాఖ ఏపీ ఎన్జీవో కార్యవర్గ సభ్యులు, మహిళా కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 'ఎపిక్' సందడి



- విద్యార్థులతో ముచ్చటించిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఈ నెల 11న విడుదల కానున్న 'ఎపిక్' సినిమా ప్రచారంలో భాగంగా హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య మంగళవారం సాయంత్రం నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సందడి చేశారు. యూనివర్సిటీకి చేరుకున్న హీరో, హీరోయిన్ ఇంజినీరింగ్ విద్యార్థులతో ముచ్చటిస్తూ సినిమా విశేషాలను వెల్లడించారు.
మంచి ఇతివృత్తంతో 'ఎపిక్' సినిమాను తెరకెక్కించినట్లు తెలిపిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య.. సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సందడి చేస్తూ సినిమా ప్రచారం నిర్వహించారు. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి, విద్యార్థి విభాగం డైరెక్టర్ రేవతి బాలకృష్ణన్ హీరో, హీరోయిన్‌కు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదవాడి కంట కన్నీరు తుడవడమే పవన్ కళ్యాణ్ లక్ష్యం : మంత్రి దుర్గేష్



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తిమ్మరాజుపాలెంలోని శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో పవన్ కళ్యాణ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా బైక్ నడిపి జనసైనికుల్లో ఉత్సాహం నింపారు. శంకరాపురంలోని హృదయాలయంలో దివ్యాంగ విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి మొక్కలు నాటారు. రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జనసేన యువజన విభాగం 'జై కొట్టు' లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి తిలకించి, కేక్ కట్ చేసి జనసైనికులకు తినిపించారు.
ఈ సందర్భంగా రోటరీ క్లబ్‌లో జరిగిన సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేనను కేవలం రాజకీయ పార్టీగా కాకుండా 'జనం కోసం పుట్టిన పార్టీ'గా అభివర్ణించారు. పేదవాడి కంట కన్నీరు రాకుండా, వారి కళ్లలో చిరునవ్వు చూడటమే పవన్ కళ్యాణ్ లక్ష్యమన్నారు. జాతీయ భావం, దేశ సమగ్రత, రాష్ట్ర ప్రగతి, ప్రజాసేవే లక్ష్యాలుగా జనసేనను పవన్ కళ్యాణ్ తీర్చిదిద్దారని తెలిపారు. 2014లో పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యలపై పోరాడుతూ వచ్చారని, సీట్ల కంటే వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ముఖ్యమని భావించి కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 21 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాలతో పోటీ చేసినప్పటికీ కూటమిని అధికారంలోకి తీసుకురావడంలో పవన్ కళ్యాణ్ రాజకీయ చాతుర్యం, త్యాగం కీలకమని అన్నారు.
నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మంత్రి తెలిపారు. మొదటి ఏడాదిలో రూ. 11 కోట్లు, ఇటీవల ప్రత్యేక నిధుల కింద రూ. 28 కోట్లు కేటాయించారని, ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ. 500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రంగాల్లో పవన్ కళ్యాణ్ తీసుకొచ్చిన మార్పులను వివరించిన మంత్రి.. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గ్రామసభలు నిర్వహించి 'పల్లె పండుగ' ద్వారా గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని అన్నారు. పర్యాటక శాఖ మంత్రిగా తనకు లభించిన అవకాశంతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో నిడదవోలును భాగస్వామ్యం చేసి అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. శెట్టిపేట వద్ద బోటింగ్, వే సైడ్ రెస్టారెంట్, చిల్డ్రన్స్ పార్క్, చినకాశీరేవు అభివృద్ధి, కోటసత్తెమ్మ ఆలయంలో భక్తులకు సౌకర్యాల కల్పన వంటి పనులు చేపడుతున్నామని చెప్పారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన శ్రేణులు సిద్ధం కావాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. జనసేన బలంగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేసేలా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసేందుకు ఏర్పాటైన 14 మంది సభ్యుల కమిటీలో తాను కూడా సభ్యుడినని తెలిపారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాలకు అతీతంగా జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. యువతలో సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు 'జై కొట్టు' విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ 'కందుల దుర్గేష్‌లో కూడా పవన్ కళ్యాణ్‌ను చూడండి' అని ఇచ్చిన పిలుపు తనకు, ప్రజలకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని, ఆయన ఇచ్చిన అవకాశానికి, ప్రజలు ఉంచిన నమ్మకానికి నిరంతరం ప్రజాసేవకుడిగా పనిచేస్తానని మంత్రి తెలిపారు.

## మంత్రి సత్యకుమార్‌కు జాతీయస్థాయిలో బీజేపీ కీలక బాధ్యతలు

- దక్షిణాదిలో 'సేవా సంకల్ప్' సారథిగా సత్యకుమార్ యాదవ్
- ఏపీ, తెలంగాణ, తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలకు ఇంచార్జ్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న లిలి'సేవా సంకల్ప్ అభియాన్'లిలికు సంబంధించి బీజేపీ జాతీయ నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ నేత సత్యకుమార్ యాదవ్ కు దక్షిణాది రాష్ట్రాల అభియాన్ ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగించింది.
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరితో పాటు అండమాన్, లక్షద్వీప్‌లలోనూ అభియాన్ కార్యక్రమాల సమన్వయం, అమలు బాధ్యతలను సత్యకుమార్ పర్యవేక్షించనున్నారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నెల రోజుల పాటు బీజేపీ, ఎన్డీయే ప్రభుత్వాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సేవా, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**ప్రజా భాగస్వామ్యమే లక్ష్యం**

ప్రజాసేవ, దేశాభివృద్ధి, 'వికసిత్ భారత్--2047' సంకల్పాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడమే అభియాన్ ప్రధాన ఉద్దేశమని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా 'ఆశీర్వాద్ కా దియా', 'నమో సేవా గాథ', 'ఆంగన్ కా ఉత్సవ్', 'కహానీ బద్లావ్ కి', 'సేవా జ్యోతి యాత్ర' తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

**రాష్ట్రాల వారీగా కార్యశాలలు**

అభియాన్‌కు సంబంధించిన కార్యాచరణపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో నిర్వహించిన కార్యశాలల్లో సత్యకుమార్ పాల్గొన్నారు. తాజాగా తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జరిగిన రాష్ట్రవ్యాప్త కార్యశాలలోనూ పాల్గొని, కార్యక్రమాల నిర్వహణ, ప్రజా భాగస్వామ్యం పెంపు, సేవా కార్యక్రమాల అమలుపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**విస్తృతంగా సేవా కార్యక్రమాలు**

దక్షిణాది రాష్ట్రాల్లో 'సేవా సంకల్ప్ అభియాన్'ను విస్తృత స్థాయిలో నిర్వహించి, ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయడంపై సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించనున్నారు. జాతీయ కార్యదర్శి హోదాలో సత్య కుమార్ ఇప్పటికే వివిధ రాష్ట్రాల బిజెపి శ్రేణులు తో మమేకమైన అనుబంధం ఉంది

## ఎస్‌ఆర్‌ఎంలో సందడిగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, కృష్ణ
- గోపికల నృత్యాలు ఆకట్టుకున్న వైనం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీలో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. యూనివర్సిటీ స్టూడెంట్స్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, కిరణ్మయి దంపతులు వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బృందగానాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. "అచ్యుతం... కేశవం... కృష్ణ దామోదరం..." అంటూ విద్యార్థులు ఆలపించిన భక్తిగీతాలకు విశేష స్పందన లభించింది. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులను అబ్బురపరిచింది. సంప్రదాయ వస్త్రధారణ, భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలతో యూనివర్సిటీ ప్రాంగణం ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభను సంతరించుకుంది. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అద్భుతమైన ప్రతిభను కనబరిచిన విద్యార్థులను వీసీ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, కిరణ్మయి దంపతులు అభినందించారు. తాడేపల్లిలోని ఇస్కాన్ ఆలయం నుంచి విచ్చేసిన కృష్ణ భక్తులు, ప్రభువుల పర్యవేక్షణలో భక్తులకు మహా ప్రసాదం వితరణ చేశారు. భక్తి, సంస్కృతి, ఉత్సాహభరితమైన కార్యక్రమాలతో జన్మాష్టమి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.
ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, స్టూడెంట్స్ అఫైర్స్ విభాగం డైరెక్టర్ రేవతి బాలకృష్ణన్, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి న్యాయవాదుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు మంత్రికి ఆహ్వానం




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి న్యాయవాదుల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్--2026కు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని బెజవాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆహ్వానించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో అక్టోబరు 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి అడ్వకేట్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఈ పోటీల్లో పాల్గొననున్నారని వివరించారు. న్యాయవాదుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌బాబు, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి. కిరణ్, ఈసీ సభ్యుడు టి. కిరణ్, స్పోర్ట్స్ సెక్రటరీ జి. రామ్‌తేజ, ఆర్గనైజర్ రైసా తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరలో సమావేశం



- ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ అవుతామని మంత్రి అనగాని హామీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా రవీంద్రరాజు రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీఆర్ఏలు, వీఆర్వోలు, సర్వేయర్లు, ఇతర కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదని తెలిపారు. గతంలో అధికారులతో సమావేశాలు నిర్వహించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు. వెంటనే ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.
ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, ఐఆర్‌తో పాటు పీఆర్సీ కమిషన్ నియామకానికి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రవీంద్రరాజు విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులతో త్వరలో సమావేశమై చర్చిస్తామని, పెండింగ్ డీఏలు, ఐఆర్, పీఆర్సీ కమిషన్‌కు సంబంధించిన ఆర్థిక అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రవీంద్రరాజు తెలిపారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగుల వైద్య బిల్లులు పరిష్కరించాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న పదవీ విరమణ పొందిన ఉద్యోగుల వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ బిల్లులను తిరస్కరించకుండా వెంటనే పరిష్కరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం కోరింది. ఈ మేరకు సంఘం నాయకులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆగస్టు 24న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం బిల్లులను ఉప ఖజానా కార్యాలయం ద్వారా పంపలేదనే కారణంతో గతంలో సమర్పించిన బిల్లులను తిరస్కరించడం వల్ల పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. తిరస్కరణకు గురైన బిల్లులపై ఉప ఖజానా కార్యాలయాలను సంప్రదించగా, అవి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కావడానికి ముందే పెండింగ్‌లో ఉన్న పాత బిల్లులు కావడంతో తాము పరిష్కరించలేమని, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచే ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టుకు పంపించుకోవాలని సూచిస్తున్నారని పేర్కొన్నారు.

## ఆరోగ్య ముప్పులను ముందుగానే పసిగట్టాలి : ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్

- డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకుని ప్రజారోగ్య సేవలను బలోపేతం చేయాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** సాంకేతిక పరిజ్ఞానం, అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమగ్రంగా వినియోగించి వ్యాధుల పర్యవేక్షణ, ముందస్తు అంచనా, నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి. వీరపాండ్యన్ సూచించారు. ప్రజారోగ్య కార్యక్రమాల రూపకల్పన, అమలులో డేటా ఆధారిత నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్, ఐఐటీ బాంబే తదితర సంస్థల సాంకేతిక సహకారంతో ఏర్పాటు చేస్తున్న 'వ్యాధుల పర్యవేక్షణ, నిర్ణయాల సహాయక కేంద్రం' కార్యకలాపాలపై విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యశాలలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న సమాచారంతో రూపొందించిన 'అవేర్' వ్యాధి నమూనా, నిర్ణయ సహాయక వ్యవస్థ ద్వారా సంక్రమణ, అసంక్రమిత వ్యాధులను ముందుగానే అంచనా వేసే అవకాశం ఉందన్నారు.
రాష్ట్రంలోని వ్యాధుల పరిస్థితిని పటాల రూపంలో రూపొందించి, వ్యాధుల తీవ్రత, వ్యాప్తిని రాష్ట్ర స్థాయి నుంచి మండలం, గ్రామం, గ్రామ, వార్డు సచివాలయ స్థాయి వం-కు గుర్తించవచ్చని వీరపాండ్యన్ తెలిపారు. తల్లి, శిశు మరణాల గణాంకాల ఆధారంగా కూడా ప్రత్యేక పటాలను రూపొందించినట్లు చెప్పారు. సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా వ్యాధులు ఎక్కువగా ప్రభావం చూపే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. రాష్ట్రస్థాయిలో అభివృద్ధి చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో సమర్థంగా వినియోగించినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది సమాచారాన్ని విశ్లేషించి పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మారుమూల, గిరిజన, సరిహద్దు ప్రాంతాల్లో సమాచార సంబంధ సమస్యలు ఉన్నా ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా ప్రత్యామ్నాయ కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.
వ్యాధుల సమాచార విశ్లేషణ, భవిష్యత్ వ్యాప్తి అంచనా, ప్రభుత్వ నిర్ణయాలకు అవసరమైన విధానపరమైన సూచనలపై కార్యశాలలో విస్తృతంగా చర్చించారు. కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, వ్యాధి నమూనాల రూపకల్పన, పరిస్థితుల విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతిక సామర్థ్యాలను కేంద్రం ద్వారా మరింత విస్తృతంగా వినియోగించడంపై నిపుణులు చర్చించారు. కేవలం గతంలో జరిగిన పరిస్థితులను తెలుసుకోవడం కాకుండా, భవిష్యత్‌లో ఎక్కడ, ఎవరిపై ఆరోగ్య ప్రభావం ఉండే అవకాశం ఉందో ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలను సూచించేలా కేంద్రం పనిచేయాలని నిర్ణయించారు. తొలి ఏడాదిలో ప్రతి ఆరోగ్య కార్యక్రమం నుంచి మూడు నుంచి ఐదు అధిక ప్రాధాన్యత కలిగిన అంశాలను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా పనిచేయాలని నిర్ణయించారు. అంటువ్యాధులు, అసంక్రమిత వ్యాధులు, తల్లి--శిశు ఆరోగ్యం, వ్యాధుల పర్యవేక్షణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.
ప్రాధాన్యతా అంశాలకు నోడల్ అధికారులను నియమించి ఆరు నుంచి పన్నెండు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు 80 మంది రాష్ట్రస్థాయి నోడల్ అధికారులు, ఐఐటీ బాంబే, గేట్స్ ఫౌండేషన్, స్వస్తి, ఆర్ట్‌పార్క్ తదితర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు కార్యశాలలో పాల్గొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని కేంద్రానికి విద్యాపరమైన ప్రధాన సంస్థగా, సమావేశాల సమన్వయ సంస్థగా నిర్ణయించారు. కేంద్రం నిర్వహణ, నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే కొనసాగుతుందని తెలిపారు. నమూనాలు రూపొందించడం కంటే వాటి ఆధారంగా సకాలంలో చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన ఆరోగ్య ఫలితాలు అందించడమే కేంద్రం విజయానికి ప్రధాన ప్రమాణమని పేర్కొన్నారు.
సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జాతీయ ఆరోగ్య మిషన్ మిషన్ డైరెక్టర్ కె. వి. ఎన్. చక్రధర్‌బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ ఏ. ఎల్. పద్మావతి, ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పులాల చంద్రశేఖర్, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఏ. విష్ణువర్ధన్, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ పద్మావతి, రిజిస్ట్రార్ డాక్టర్ తల్లపల్లి సాయి సుధీర్, కేంద్రం ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. లక్ష్మీ సూర్యప్రభ, ఐఐటీ బాంబే ప్రొఫెసర్ డాక్టర్ సారికా మెహ్రా, గేట్స్ ఫౌండేషన్ సీనియర్ కార్యక్రమ అధికారి శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు..

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467